


బృందావనమిది.. అందనిది..!

- చరిత్ర పుటల్లోకి కేఆర్ఎస్ బృందావన్ గార్డెన్స్
- అమ్యూజ్‌మెంట్ పార్క్‌గా ఆధునికీకరణకు తీర్మానం
- శాండల్‌వుడ్, బాలీవుడ్, టాలీవుడ్..
- ఇలా ఎన్నో సినిమాల షూటింగులకు వేదిక


బృందావన్ గార్డెన్స్

బెంగళూరు, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): దశాబ్దాలకాలంగా కోట్లాదిమంది ఆహ్లాదకరమైన ప్రాంతంగా భావించి వందలాది సినిమాల షూటింగ్‌లకు వేదిక అయిన బృందావన గార్డెన్స్ ఇక చరిత్ర పుటల్లో కలవనుంది. కావేరి నదికి అనుబంధంగా అత్యంత భారీ జలాశయం కృష్ణరాజసాగర్ ప్రాజెక్టు ముందు భాగాన ఉండే బృందావన గార్డెన్స్‌ను కావేరి అమ్యూజ్‌మెంట్ పార్క్‌గా మార్చేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. దీంతో గార్డెన్ పేరు కనమరుగు కానుంది. బృందావన గార్డెన్స్‌కు ఆధునికతను జోడించనున్నారు. మైసూరుసంస్థానం నాల్వడి కృష్ణరాజ ఒడయార్ దూరదృష్టితో 1911లో కృష్ణరాజసాగర్ డ్యాం నిర్మాణ ప్రక్రియ ప్రారంభమైంది. ఎన్నో అడ్డంకులు, ఎన్నెన్నో వ్యయప్రయాసలమధ్య నిర్మాణాలు కొనసాగి 1932 నాటికి ప్రాజెక్టు పూర్తి అయ్యింది. జలాశయాన్ని మరింత సర్వాంగ సుందరంగా తీర్చి పర్యాటకులను ఆకట్టుకునేలా డ్యాంకు అనుబంధంగా 60 ఎకరాల విస్తీర్ణంలో బృందావనాన్ని నిర్మించారు. 75ఏళ్లక్రిందట రాష్ట్రంలోనే అద్భుతం అనిపించేలా గార్డెన్స్‌గా కొనసాగింది. ఇక్కడ మ్యూజికల్ ఫౌంటైన్ ప్రత్యేక ఆకర్షణగా ఉండేది. అందుకే కన్నడ సినిమా అంటే కనీసం ఒకటి రెండు పాటలు బృందావన గార్డెన్స్‌లో చిత్రీకరణ సాగేది. కన్నడనటులలో బృందావనగార్డెన్స్‌లో నటించని వారు లేరని చెప్పవచ్చు. కేవలం కన్నడ సినిమాలే కాకుండా దక్షిణాదిన అన్ని భాషల సినిమాలతో పాటు బాలీవుడ్‌కు సంబంధించి కూడా షూటింగ్ కూడా ఇక్కడ జరిగాయి. ఒకప్పుడు బ్లాక్ అండ్ వైట్ సినిమాలనుంచి విదేశాలకు షూటింగ్ వెళ్లే దాకా బృందావన గార్డెన్స్ హాట్ ఫేవరెట్‌గా కొనసాగింది. ఇలాంటి బృందావన గార్డెన్స్‌కు ఆధునికీకరణ జోడించి మరింతమంది పర్యాటకులను ఆకట్టుకునేలా తీర్చేదిద్దనున్నారు. కావేరి అమ్యూజ్‌మెంట్‌పార్క్‌గా పేరు మార్పునకు ప్రభుత్వం అనుమతించింది. ఈ ప్రాజెక్టుకు డీపీఆర్ కూడా సిద్ధం చేశారు. త్వరలో పనులు ప్రారంభంకానున్నాయి.

హత్య కేసులో ఏడుగురికి
పదేళ్ల జైలు శిక్ష

- దోషుల్లో ఇద్దరు మహిళలు
- హొస్పేట్ కోర్టు తీర్పు


హత్యకు గురైన భువనేశ్వరి (ఫైల్)

బళ్లారి, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): హత్య కేసులో ఏడుగురికి పదేళ్ల జైలు శిక్ష విధిస్తూ హొస్పేట్ జిల్లా కోర్టు మంగళవారం తీర్పునిచ్చింది. విజయనగర జిల్లా హొస్పేట్‌లో భువనేశ్వరి(68) అనే వృద్ధురాలి కేసులో స్పెషల్ న్యాయమూర్తి అబ్దుల్ రెహమాన్ తీర్పు వెల్లడించారు. విజయనగ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. 2021 అక్టోబరు 22 న హొస్పేట్ లోని రాణిపేటలో భువనేశ్వరి వృద్ధురాలు ఇంట్లో ఒక్కరే ఉన్నారు. ముందుగా ఒక మహిళ ఇంటి వద్దకు వెళ్లి తాగడానికి నీరు అడిగింది. సరే అంటూ ఆమె ఇంటి బయట నుంచి నీరు తెచ్చేందుకు లోనికి వెళ్లింది. ఆమె వెంట మహిళ కూడా లోనికి వెళ్లింది. ఆమెతో పాటు అప్పుడే దగ్గరలో మరో ఆరుగురు లోనికి వెళ్లి మహిళ అరవకుండా నోరు మూసి చీర కొంగుతో గొంతు నులిపి ఊపిరాడకుండా చేసి చంపేశారు. ఇంట్లో రూ 10 వేలు నగదు, రూ.8 లక్షల విలువ చేసే 270 గ్రాములు బంగారు ఆభరణాలు దోచుకుని పరారయ్యారు. కేసు విచారణలో హావేరి తాలూకా ముత్తూరులోని దులిగొప్ప గ్రామానికి చెందిన కృష్ణ దేవేంద్ర తదాస, రాణిబెన్నూరుకు చెందిన నౌషాద్ అలీ, హనగల్లుకు చెందిన తైభూజుల్లా. దావణగెరె కు చెందిన బీరేష్, హరిహర్‌కు చెందిని గీత, భద్రావతికి చెందిన ప్రమీళ దోషులుగా తేలడంతో కోర్టు పదేళ్ల జైలు శిక్షను ఖరారు చేస్తూ తీర్పు ఇచ్చింది.

నేడు కోట మల్లేశ్వరుడి
బ్రహ్మ రథోత్సవం
- 8లో


మూల విరాట్


ముస్తాబైన కోట మల్లేశ్వరుడి ఆలయం

తీపి..చేదు..!


భాల్కిలోని మహాత్మాగాంధీ సహకార చక్కెర ఫ్యాక్టరీ



- నష్టాల బాటలో సహకార చక్కెర పరిశ్రమలు
- 13 ఫ్యాక్టరీల్లో రూ.కోట్లలో బకాయిలు
- గాడితప్పిన పాలన.. మూత దిశగా అడుగులు
- ప్రభుత్వం ఆదుకోకపోతే ఇబ్బందులే..
- లాభాల దిశగా ప్రైవేట్ పరిశ్రమలు
- నాలుగేళ్లలో కొత్తగా 15 ప్రారంభం

బెంగళూరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): అన్నీ చక్కెర కర్మాగారాలే..అన్నింట్లోనూ తయారయ్యేది చక్కెరే..కానీ సహకార చక్కెర కర్మాగారాలు కోట్లాది నష్టాల్లో విలవిలలాడు తుంటే ప్రైవేట్ కర్మాగారాలు మాత్రం లాభాలతో వికసిస్తున్నాయి. దక్షిణభారత దేశంలోనే చక్కెర ఉత్పత్తికి కర్ణాటక పేరొందింది. ఉత్తర కర్ణాటక జిల్లాల్లో లక్షల హెక్టార్లలో ఏటా చెరకు సాగు చేస్తారు. అందుకు అనుగుణంగానే చక్కెర పరిశ్రమలు కూడా దాదాపు వందదాకా ఉన్నాయి. దశాబ్దాల కాలం క్రిందట ప్రాంతాలవారీగా వివిధ సహకారసంఘాలకు అనుబంధంగా చక్కెర పరిశ్రమలు ఏర్పాటయ్యాయి. ప్రాంతీయంగా రైతులుసాగు చేసిన చెరుకును ఫ్యాక్టరీలకు తరలించేవారు. పంటసాగుకు అవసరమయ్యే రసాయన ఎరువులతో పాటు ఖర్చులకు పంట రుణాలు సులభతరంగా అందుబాటులో ఉంటాయనే కారణంతో ఒకప్పుడు సహకార చక్కెర ఫ్యాక్టరీలు తెరవాలనే ఆలోచన వచ్చింది. కొన్నేళ్లుగా చక్కెర ఫ్యాక్టరీలు లాభాలబాటలో కొనసాగాయి. మారిన రాజకీయాలతో సహకారసంఘాల ఎన్నికలు స్థానికంగా అభివృద్ధి, సంస్థను కాపాడుకోవాలనే ఆలోచనకంటే ప్రతిష్టకు ప్రాధాన్యం ఇవ్వడంతో దారి తప్పాయి. ఇలా రాష్ట్రంలో కొనసాగుతున్న 13 సహకార చక్కెర పరిశ్రమలు నష్టాల ఊబిలో కూరుకుపోయాయి. ఏకంగా వందలకోట్ల నష్టం రావడంతో వాటి భవిష్యత్తు అగమ్యగోచరంగా మారిపోయింది. చక్కెర ఉత్పత్తి చేసే రాష్ట్రాల్లో కర్ణాటక దేశంలోనే మూడోస్థానంలో ఉంది. ప్రైవేట్ చక్కెర ఫ్యాక్టరీలు ఉత్తర కర్ణాటక, మండ్య, మైసూరు, చామరాజనగర జిల్లాల్లో ఎక్కడ చూసినా ఉన్నాయి. ఇదే జాతీయస్థాయిలో అత్యధిక చక్కెర ఉత్పత్తికి కారణంగా ఉంది. సహకార చక్కెర ఫ్యాక్టరీలు నష్టాలబాట పట్టి మూతపడేస్థాయికి చేరగా ప్రైవేట్ చక్కెర ఫ్యాక్టరీలు లాభాల బాటలో కొనసాగుతున్నాయి. సరైన పాలన, క్రమశిక్షణ కల్గిన మేనేజ్‌మెంటే దీనికి ప్రధాన కారణాలుగా చెప్పవచ్చు.

లాభాల బాటలో ప్రైవేట్ ఫ్యాక్టరీలు...

రాష్ట్రంలో ప్రైవేట్ చక్కెర ఫ్యాక్టరీలు లాభాల బాటలో ఉన్నాయి. 2021-22 సంవత్సరంలో రాష్ట్రవ్యాప్తంగా 44 ప్రైవేట్ ఫ్యాక్టరీలు ఉండేవి. ప్రస్తుతం 59కు పెరిగాయి. ఇలా నాలుగేళ్ల వ్యవధిలో 15 కొత్త ఫ్యాక్టరీలు ఏర్పాటయ్యాయి. ఒక్కోసంస్థ 2-3 ఫ్యాక్టరీలు తెరిచి లాభాలబాటలో కొనసాగిస్తున్నాయి. సహకార ఫ్యాక్టరీలకు లాభాలు ఎందుకు సాధ్యం కావడం లేదనేది అంతుపట్టని ప్రశ్నగా మారింది. సహకార ఫ్యాక్టరీల ప్రస్తుత పరిస్థితి 2015-16కంటే క్లిష్టంగా మారాయి. అప్పట్లో సుమారు 3.5 లక్షల మెట్రిక్ టన్నులదాకా చెరుకును క్రషింగ్ చేసేవారు. ప్రస్తుతం 7.26 లక్షల మెట్రిక్ టన్నులకు చేరినా నష్టంగానే ఉంది. బైలహొంగలలోని సోమేశ్వర, మలప్రభ, నంది ఫ్యాక్టరీలు 2లక్షల నుంచి మూడింతల లక్షల మెట్రిక్ టన్నుల క్రష్టింగ్ సామర్థ్యం పెరిగింది.

రాష్ట్రంలో 99 చక్కెర పరిశ్రమలు..

రాష్ట్రంలో ప్రస్తుతం 99 చక్కెర పరిశ్రమలకు అనుమతి ఉన్నాయి. వీటిలో 59 ప్రైవేట్ కాగా 13 సహకారసంఘాలకు అనుబంధంగాను, 8 సహకారసంఘాల కాంట్రాక్టు పద్ధతిన, ఒకటి ప్రభుత్వరంగ సంస్థగా ఉంది. ఇలా ప్రస్తుతం 81 చక్కెర పరిశ్రమలు పనిచేస్తున్నాయి. వీటిలో 13 సహకార చక్కెర పరిశ్రమలు నష్టంలో ఉండడంతోపాటు ఏటా చెరుకును రైతులు సదరు ఫ్యాక్టరీలకు వేసేందుకు వెనుకడుగు వేయడం, కొన్ని ప్రాంతాల్లో సాగు తగ్గడం కారణమవుతోంది. కొన్ని సహకార చక్కెర ఫ్యాక్టరీలను ప్రైవేట్ సంస్థలకు లీజుకు ఇస్తున్నారు. సహకార చక్కెర ఫ్యాక్టరీలో లాభాలు సాధించడం ఎలా ఉన్నా కనీసం నిర్వహణా భారం కూడా గగనమవుతోంది. 21 సహకార చక్కెర ఫ్యాక్టరీల్లో ఇప్పటికే 8 ఫ్యాక్టరీలను కాంట్రాక్టు లేదా లీజుకు ఇచ్చారు. మిగిలిన 13 ఫ్యాక్టరీలు దాదాపు వెయ్యికోట్ల దాకా నష్టాల్లో ఉన్నాయి. 2024లో చిక్కోడిలోని చిదానంద బసప్రభు, అథణిలోని కృష్ణ, బైలహొంగలలోని సోమేశ్వర ఫ్యాక్టరీలు ఏడాదిలో కొంతమేర లాభం వచ్చినా నిర్వహణాభారం కష్టం అనిపించింది. ఇక మిగిలిన ఫ్యాక్టరీల్లో కేవలం ఏడాదిలో రూ.37 కోట్ల రూపాయలు నష్టాలబాటపట్టాయి.

సహకార షుగర్ ఫ్యాక్టరీలు		నష్టం (రూ.కోట్లలో)
భాల్కి	మహాత్మాగాంధీ	470.34
బీదర్	నారంజ్	724.80
సంకేశ్వర	హిరణ్యకేశి	239.38
నిప్పాణి	హాలసిద్ధనాథ	231.99
బెళగావి	కాకతీయ మార్కండేయ	143.67
బైలహొంగల	సోమేశ్వర	136.48
విజయపుర	నంది	99
చిక్కోడి	చిదానందబసప్రభు	97.03
గోకాక్	ఘటప్రభ	80.99
హుక్కేరి	సంగమ	74.80
అథణి	కృష్ణ	61.16
ఇండి	శ్రీబీమాశంకర	18.50

నష్టాలకు ప్రధాన కారణాలు

పాలనా వ్యవస్థలో లోపం, ఆర్థిక పరమైన అంశాలలో నియంత్రణ లేకుండా ఖర్చు చేయడం, నిధుల కొరతతో ఆధునిక సాంకేతికత విధానాలను ప్రవేశపెట్టడంలో విఫలం, ప్రైవేట్ ఫ్యాక్టరీల తరహాలో ఏడెనిమిది నెలలపాటు క్రషింగ్ కొనసాగించకపోవడం, చక్కెర, మొలాసెస్, ఇథనాల్, విద్యుత్ ఉత్పత్తికి ప్రాధాన్యం ఇవ్వకపోవడం, అన్నదాతల విశ్వాసాన్ని పొందడంలో విఫలం కావడం వంటివి షుగర్ ఫ్యాక్టరీ నష్టాలకు ప్రధాన కారణాలుగా ఉన్నాయి. నష్టాల కారణంగా రూ.కోట్లలో రైతులకు చెల్లించాల్సిన బిల్లులు పెండింగ్‌లో ఉండిపోయాయి. విద్యుత్, ఇథనాల్‌ల ఉత్పత్తి పట్ల ఉత్సాహం చూపడం లేదు. రాష్ట్రంలో 10 సహకార చక్కెర ఫ్యాక్టరీలు విద్యుత్, ఇథనాల్ ఉత్పత్తి చేస్తాయి. ఘటప్రభ, సోమేశ్వర, బీమాశంకర, ఫ్యాక్టరీలు మినహా మిగిలిన 8 ఫ్యాక్టరీల్లో 131 మెగావాట్ల విద్యుత్‌తోపాటు 4 ఫ్యాక్టరీలలో 200 కేఎల్‌పీడీ (కిలో లీటర్ పర్ డే) ఇథనాల్ ఉత్పత్తి అవుతుంది. సంకేశ్వర్‌లోని హిరణ్యకేశి, చిక్కోడిలోని చిదానంద బసప్రభు, ఇథనాల్, విద్యుత్ రెండింటినీ ఉత్పత్తిచేసేవారు.

దేశంలోనే అత్యధిక పెట్టుబడులు

- ఇది రాష్ట్ర ప్రభుత్వ నిబద్ధత
- పెట్టుబడులు పెట్టండి.. సౌకర్యాలు కల్పిస్తాం
- గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో సీఎం సిద్దరామయ్య


సదస్సుకు వీల్ చెయిర్‌లో వస్తున్న సీఎం


సదస్సు ప్రారంభోత్సవంలో కేంద్ర రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్, సీఎం సిద్దరామయ్య, డీసీఎం డీకే శివకుమార్ తదితరులు

బెంగళూరు, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): దేశ ఆర్థిక పరివర్తనలో కర్ణాటక నిరంతరం ముందంజలో ఉన్న రాష్ట్రమని దేశంలోనే అత్యధిక పెట్టుబడులు సాధిస్తోందని ఇది మా నిబద్ధతను రుజువుచేస్తోందని సీఎం సిద్దరామయ్య పేర్కొన్నారు. ప్రపంచ పెట్టుబడిదారుల సదస్సు (గ్లోబల్ ఇన్వెస్టర్స్ మీట్) బెంగళూరు ప్యాలెస్ మైదానంలో మంగళవారం సాయంత్రం లాంఛనంగా ప్రారంభించారు. కేంద్ర రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్, కేంద్ర పౌర ఆహార సరఫరాలశాఖ మంత్రి ప్రహ్లాద్‌జోషి, డీసీఎం డీకే శివకుమార్ ముఖ్యులుగా పాల్గొన్నారు. రాష్ట్ర పరిశ్రమలశాఖ మంత్రి ఎంబీ పాటిల్ అధ్యక్షతన సదస్సు జరిగింది. కేంద్రమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ మాట్లాడుతూ దేశంలో సాఫ్ట్‌వేర్ రంగంలో పునాది వేసినట్టుగానే కృత్రిమమేథస్సు (ఏఐ) టెక్నాలజీలోనూ బెంగళూరు ప్రగతిపరంగా వెళ్లనుందని విశ్వాసం వ్యక్తం చేశారు. సాంకేతిక, ఆధునికశక్తి కేంద్రమైన బెంగళూరులో ప్రపంచపెట్టుబడిదారుల సదస్సు ద్వారా రాష్ట్రానికి అటు దేశానికి భారీగా ప్రయోజనాలు కలగనున్నాయన్నారు.

అనాదిగా అభివృద్ధి ఆనవాళ్లు : సీఎం

ముఖ్యమంత్రి సిద్దరామయ్య పారిశ్రామికవేత్తలను ఉద్దేశించి మాట్లాడుతూ రాష్ట్రంలో పెట్టుబడుల ద్వారా సమగ్ర అభివృద్ధి ఫలితాలు సాధ్యమవుతున్నాయని సుస్థిరమైన ప్రగతికి కారణమవుతోందని కొనియాడారు. చాళుక్యులు, హొయసళ, విజయనగర సామ్రాజ్య, మైసూరు ఒడయార్‌ల కాలంలోనే చేనేత, శిల్పకళ, ఐరన్, చేతివృత్తుల తయారీకి నెలవై ఉందన్నారు. మైసూరు సిల్క్, శ్రీగంధం ఉత్పత్తులు రాజులకాలంనుంచి కొనసాగిందన్నారు. 1923లో మైసూరు ఐరన్ ఫ్యాక్టరీ దేశంలోనే ప్రథమమైనదన్నారు. కొడగుతోపాటు పలు జిల్లాల్లో కాఫీ ఉత్పత్తి ద్వారా భారత కాఫీ రాజధానిగాను కర్ణాటక నిలిచిందన్నారు. హెచ్ఏఎల్, బీఈఎల్, బీఈఎంఎల్ వంటి ప్రభుత్వరంగసంస్థల ద్వారా కర్ణాటక భారీ పరిశ్రమల ద్వారా దేశంలోనే ప్రగతిపరమైన సాధనలు చేస్తోందన్నారు. ఐఐఎస్‌సీ, ఐఐఎంతో పాటు 200కుపైగా ఇంజనీరింగ్, మెడికల్ కళాశాలల ద్వారా ప్రతిభావంతులు, సాధనలు చేస్తున్నారన్నారు. ఏఐ, రోబోటిక్స్, స్పేస్, బయోటెక్‌లో 400కుపైగా పరిశోధనా అభివృద్ధి కేంద్రాలు, రాష్ట్రంలో ఉన్నాయన్నారు. బాధ్యతాయుత, సుస్థిర అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్న కర్ణాటక పర్యావరణ స్నేహి పరిశ్రమలకు ప్రాధాన్యం ఉందన్నారు.

అంతర్జాతీయ స్థాయికి బెంగళూరు..

ఆహ్లాదకరమైన వాతావరణం కల్గిన బెంగళూరును సిలికాన్ వ్యాలీ ఆఫ్ ఇండియా వంటి పేరు వచ్చేందుకు ఎందరో ప్రోత్సాహకం కారణమన్నారు. పర్యాటక, సాంస్కృతిక పరంపర, ప్రకృతి రమణీయప్రాంతాలు రాష్ట్రానికి ప్రత్యేకమైన్నారు. బెంగళూరు ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ ఏటా ప్రపంచస్థాయిలో పోటీ పడుతోందని అందుకే భవిష్యత్తు తరాలను దృష్టిలో ఉంచుకుని బెంగళూరుకు అనుబంధంగా ఏర్పాటు చేయదలిచామన్నారు. 320 కిలోమీటర్ల సముద్రతీరం ద్వారా కూడా పరిశ్రమలకు అనుకూలంగా ఉందన్నారు. 15వేలకుపైగా స్టార్టప్‌లు, 40కుపైగా యూనికార్న్ కల్గిన కర్ణాటక దేశంలోనే అతిపెద్ద స్టార్టప్ హబ్‌గా ఉందన్నారు. సెమికండక్టర్ ఉత్పాదనలో ప్రముఖకేంద్రంగా రాణిస్తోందని ఇంటెల్, టీఎస్ఎంసీ, మైక్రాన్ సంస్థలు పెట్టుబడులు పెట్టిందన్నారు. దేశ ఎలక్ట్రానిక్ ఎగుమతులలో 60శాతం కర్ణాటకనుంచే సాధ్యమవుతోందని, సాఫ్ట్‌వేర్‌రంగంలో 40శాతం కర్ణాటకనుంచే సాధ్యమవుతోందన్నారు. ఏఐ ఆధారిత బ్లాక్‌చెయిన్, క్లౌడ్ కంప్యూటింగ్‌లలో పెట్టుబడులకు మంచి అవకాశాలు ఉన్నాయన్నారు. రాష్ట్రంలో పలు కంపెనీల రాజధానిగా బెంగళూరు నిలిచిందన్నారు. ఏరోస్పేస్ రక్షణ ఉత్పత్తులలో 65శాతం రాష్ట్రంలోనే సాధ్యమవుతోందన్నారు. బయోటెక్ పరిశోధనలకు ప్రధానకేంద్రంగా ఉందన్నారు. క్విన్‌సిటీని ఏఐ, అంతరిక్ష, క్వాంటమ్ కంప్యూటింగ్, బయోటెక్‌ల కోసం కేటాయించామన్నారు. పెట్టుబడిదారుల సదస్సుకు 40కుపైగా అంతర్జాతీయస్థాయి సంస్థలు, స్టార్టప్ కంపెనీలు, డ్రోన్ టెక్నాలజీ, స్పేస్ టెక్నాలజీ, అగ్రి, హెల్త్ టెక్నాలజీ రంగాలు భాగస్వామ్యం కావడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో మంత్రులు మునియప్ప, పరమేశ్వర్, మహదేవప్ప, శరణుప్రకాశ్ పాటిల్, ప్రియాంకఖర్గేతోపాటు పారిశ్రామికవేత్తలు మైఖేల్‌బ్రిక్స్, ఆనంద్‌మహీంద్రా, సజ్జన్‌జిందాల్, కిరణ్‌మజుందార్‌షా, గీతాంజలి కిర్లోస్కర్‌తోపాటు రాష్ట్రప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాలిని రజనీశ్ తదితరులు పాల్గొన్నారు. కాగా సీఎం సిద్దరామయ్య ఇటీవల కొన్ని రోజులుగా కాలినొప్పితో విశ్రాంతిలో గడిపారు. తొలిసారిగా కార్యక్రమానికి వీల్‌చెయిర్‌లో హాజరయ్యారు. సదస్సులో సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణ అనిపించాయి.


ఆకాశంలో చక్కర్లు కొడుతూ..


అక్కడ చూడు చిన్నా..


బంధిద్దాం..

అలరించిన విమాన విన్యాసాలు

7


గగన తలంలో లోహ విహంగ విన్యాసం

దగాపడ్డ రైతు..!

- హావళిగిలో భారీగా విత్తన జొన్న సాగు
- అధిక దిగుబడులతో అన్నదాత ఆనందం
- అమాంతం ధర తగ్గించేసిన దళారులు
- నష్టానికి విక్రయించుకోలేక అవస్థలు
- ఎండిపోతున్న వేల క్వింటాళ్ల నిల్వలు



హావళిగి ఉన్నత పాఠశాల వద్ద నిల్వ ఉంచిన జొన్న దిగుబడులు

విడపనకల్లు, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): అప్పో సప్పో చేసి.. పెట్టుబడి పెట్టి.. ఆరుగాలం శ్రమించి రైతు పండించిన పంట చెల్లని కాసుగా మారిపోయింది. అన్నదాత.. దళారుల చేతిలో ఆటబొమ్మగా మారిపోయాడు. దిగుబడి దండిగా వచ్చిందన్న ఆనందంలో ఉన్న రైతుకు దళారులు దగా చేశారు. అమాంతం ధరను తగ్గించేశారు. కొనడానికి కూడా రాకుండా మొహం చాటేస్తున్నారు. దీంతో వేల క్వింటాళ్ల విత్తన జొన్న దిగుబడిని రైతు నిల్ల చేసుకోలేక ఇబ్బందులు పడుతున్నాడు. తన కష్టం ఎండకు ఎండిపోతుంటే కన్నీళ్లు పెట్టుకుంటున్నాడు. మండలంలోని హావళిగి గ్రామ రైతుల దుస్థితి ఇది. జీబీసీ, హెచ్చెల్సీ, బోరుబావుల కింద దాదాపు 5వేల ఎకరాల్లో విత్తన జొన్న సాగు చేశారు. బళ్లారి జిల్లా మోకా గ్రామానికి చెందిన దళారుల నుంచి గ్రామంలోని కొంత మంది వ్యాపారులు వివిధ రకాల విత్తనాన్ని తెచ్చి రైతులకు విక్రయించారు. రెండు కేజీల సీడ్ జొన్న ప్యాకెట్ రూ.700 ప్రకారం ఎకరాకు రెండు ప్యాకెట్లు విత్తారు. దిగుబడి ఎకరాకు 8 నుంచి 10 క్వింటాళ్లు వచ్చింది. ఖర్చులు సొంత పొలం ఉన్న వారికి ఎకరాకు రూ.40వేలు, కౌలు రైతుకు రూ.60వేలు వస్తుంది. గతేడాది విత్తన జొన్నను క్వింటా రూ.4500 నుంచి 4800 ధరతో వ్యాపారులు కొనుగోలు చేశారు. ఈసారి దిగుబడి ఎక్కువగా రావడంతో దీనిని క్యాష్ చేసుకునేందుకు దళారులు సిండికేట్‌గా మారారు. నెల రోజుల ముందు ఇదే విత్తన జొన్నను క్వింటా రూ.4200తో కొనుగోలు చేసిన వ్యాపారులు ఒక్కసారిగా ధర తగ్గించేశారు. ప్రస్తుతం రూ.3వేలకు అడుగుతున్నారని రైతులు వాపోతున్నారు. ఈ ధరకు విక్రయిస్తే ఎకరాకి రూ.30 వేలకు మించి రాదు. పెట్టుబడి సొంత పొలం ఉన్న రైతులకు ఎకరాకి రూ.40 వేలు వచ్చింది. ఆ లెక్కన పెట్టుబడి కూడా రాదన్న మాట. దీంతో నష్టానికి ఎలా విక్రయించాలని రైతులు వాపోతున్నారు. దిగుబడిని అలానే ఉంచుకున్నారు. ఒక్కో రైతు వద్ద 600 నుంచి 1500 బస్తాల దిగుబడి నిల్వ ఉంది. దాదాపుగా 40వేల క్వింటాళ్ల జొన్న మూలన పడింది. ఇళ్లలో నిలువ ఉంచుకునేందుకు స్థలం లేని రైతులు ఎక్కడ పడితే అక్కడ ఉంచేస్తున్నారు. 15 నుంచి 20 మంది కలిసి ఓ దగ్గర నిల్వ చేశారు. మరి కొంతమంది పొలాల్లోనే నిల్వ ఉంచి రాత్రి సమయాల్లో కాపలాగా ఉంటున్నారు. ఇంకొంతమంది గోదాముల్లో నిల్వ ఉంచుకున్నారు. ఇక్కడ పండిన విత్తన జొన్నను బీహార్, మధ్యప్రదేశ్, ఒడిశా, ఢిల్లీ, హరియాణా, రాజస్థాన్, జార్ఖండ్ తదితర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తారు. మరో నెల రోజులు జొన్న దిగుబడి ఎండకు, గాలికి, ఇలాగే ఉంటే పురుగు పట్టి కిలో రూ.10కి కూడా కొనుగోలు చేయరని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కంపెనీలతో ఒప్పందం లేకపోవడమే శాపమా?

విత్తన జొన్న పండించే రైతులు.. ఆయా కంపెనీలతో ఒప్పందం లేకపోవడమే వారికి శాపంగా మారిందని తెలుస్తోంది. కంపెనీతో రైతు ఒప్పందం చేసుకుని పంట పండించి ఉంటే వారే కొనుగోలు చేస్తారు. అగ్రిమెంట్ ధర రూ.5వేలు ఉంటే, ప్రస్తుత మార్కెట్ రేటుతో సంబంధం లేకుండా కంపెనీ అంతే చెల్లించేది. రైతులు.. కంపెనీలను ఆశ్రయించకుండా సొంతంగా దళారులతో విత్తనాన్ని కొనుగోలు చేసి, పొలంలో విత్తుకున్నాడు. దీంతో ఆయా కంపెనీల ప్రతినిధులు.. రైతులు పండించిన సీడ్ కల్తీదనీ, అందుకే కొనుగోలు చేయట్లేదని ప్రచారం చేస్తున్నారు. వ్యాపారులు సిండికేట్ కావడంతో ఒక్క హావళిగి గ్రామంలోనే దాదాపుగా 40 వేల క్వింటాళ్ల విత్తన జొన్న నిల్వ ఉంది. పండించిన పంట అమ్ముడుపోక, చేసిన అప్పులు తీర్చలేక రైతులు నరక యాతన అనుభవిస్తున్నారు.



కల్లంలో నిల్వలు

విత్తన జొన్న మంచిదే..



హావళిగిలో రైతులు పండించిన విత్తన జొన్న మంచిదే. కంపెనీలతో రైతులు అగ్రిమెంట్లు చేసుకోకపోవడంతో వారు పండించిన పంటను కొనుగోలు చేయడం లేదు. ప్రభుత్వం విత్తన జొన్నను కొనుగోలు చేయదు. రాయచూరు జొన్నలు మాత్రమే సేకరిస్తుంది. రైతులు పండించిన విత్తన జొన్నను మార్కెట్లకు తీసుకెళ్లి, విక్రయించుకోవచ్చు.

- పెన్నయ్య, మండల వ్యవసాయాధికారి, విడపనకల్లు

జొన్నలు మెత్తబడిపోతున్నాయి



ఆరెకరాల్లో విత్తన జొన్నను సాగు చేశా. వంద బస్తాల దిగుబడి వచ్చింది. ఇంట్లో నిల్వ చేసేందుకు స్థలం లేక పక్కింటి రైతు వామిదొడ్డిలో ఉంచా. ఎండలకు జొన్నలు మెత్తబడిపోతున్నాయి. దళారులు క్వింటా రూ.3వేలకు అడుగుతున్నారు. ఆ ధరకు విక్రయిస్తే రూ.30వేల వరకు నష్టం వస్తుంది.

-కణేకల్లు ఓబులేసు, రైతు, హావళిగి

నష్టానికి అమ్ముకుంటే అప్పులు ఎలా కట్టాలి?



20 ఎకరాలు కౌలుకు తీసుకుని, విత్తన జొన్నను సాగు చేశా. 600 బస్తాలు దిగుబడి వచ్చింది. ఇంటి వద్ద స్థలం లేకపోవడంతో పొలంలోనే నిల్వ చేశారు. రాత్రి సమయంలో కాపలాగా వెళ్తున్నాం. విక్రయిద్దామంటే వ్యాపారులు తక్కువ ధరకు అడుగుతున్నారు. నష్టానికి అమ్ముకుంటే అప్పులు ఎలా తీర్చుకోవాలో తెలియటం లేదు. ప్రభుత్వం ఆదుకోవాలి.

- సక్కీరప్ప, రైతు, హావళిగి



నిప్పుతో ముప్పు..!

ఎండుతున్న పచ్చికబయళ్లు
అగ్నికి ఆహుతవుతున్న తోటలు
ఆందోళనలో అన్నదాతలు



మామిళ్లపల్లి వద్ద మంటలను ఆర్పేందుకు వచ్చిన ఫైరింజన్



మామిళ్లపల్లి వద్ద మంటలకు కాలిపోయిన శ్రీగంధం మొక్కలు

కనగానపల్లి, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): వేసవి కాలం రాకనే ఎండలు మండిపోతున్నాయి. పచ్చని గడ్డి ఎండుబారుతోంది. ప్రమాదశాత్తు నిప్పంటుకుని పచ్చని పంటలు అగ్నికి బూడిదవుతున్నాయి. సకాలంలో ఫైర్‌ఇంజన్లు ప్రమాద స్థలానికి రాకపోవడంతో మంటలు వేగంగా వ్యాపించి చీనీ, అరటి, అనప, శ్రీగంధం చెట్లు కాలిపోయి రైతన్నలు తీవ్రంగా నష్టపోతున్నారు. ఇటీవల మండలంలో అగ్ని ప్రమాదాలు జరిగి పలు పంటలు, డ్రిప్పు పరికరాలు బూడిదయ్యి లక్షల్లో నష్టపోయారు. చంద్రాచర్ల గ్రామానికి చెందిన రైతు రాయపాటి శ్రీరాములుకు చెందిన జామతోట కాలిపోయి రూ.4 లక్షలు నష్టపోయాడు. మామిళ్లపల్లి భరత్‌రెడ్డికి చెంది శ్రీగంధం చెట్లు, అదే గ్రామంలోని నాగప్పకు చెందిన అనపతోట కాలిబూడిదవడంతో తీవ్రంగా నష్టపోయారు. తోటల పరిసరాలు ఎండుగడ్డి ఉండటంతో బాటసారులు, అకతాయిలు నిప్పుపెట్టడంతో ప్రమాదాలకు కారణంగా తెలుస్తోంది.

డివిజన్‌కు ఒకే ఫైర్‌స్టేషన్

ధర్మవరం డివిజన్‌కు సంబంధించి ఫైర్‌స్టేషన్ ఒక్కటే ఉండటంతో సకాలంలో ప్రమాదస్థలికి అగ్నిమాపక సిబ్బంది వెళ్లలేకపోతున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు. ధర్మవరం నుంచి కనగానపల్లి, రామగిరి, చెన్నేకొత్తపల్లి మండలాలకు సకాలంలో వెళ్లలేకపోతున్నాయి. అటవీశాఖ అధికారులు ముందస్తు చర్యలు చేపట్టక పోవడంతో కొండలు మంటలకు కాలిపోతున్నాయి. దీంతో పచ్చని చెట్లతో పాటు వన్యప్రాణులు మృత్యువాత పడుతున్నాయి.

మానవ తప్పిదంతోనే...

మానవ తప్పిదంతోనే అగ్ని ప్రమాదాలు జరుగుతున్నాయి. అగ్ని ప్రమాదం వల్ల పండ్లతోటలు కాలిపోవడంతో రైతులు నష్టపోతున్నారు. ఇందుకు ప్రభుత్వం ఎలాంటి నష్టపరిహారం చెల్లించదు. రైతులు తమ పొలాల చుట్టూ ట్రెంచులు ఏర్పాటు చేసుకోవడం, చెట్ల మధ్య ఎండు గడ్డి లేకుండా కలుపు తొలగించుకోవడం వల్ల నష్ట తీవ్రతను కొంచెమన్నా తగ్గించుకోవచ్చు.

-అమరేశ్వరి, ఉద్యానశాఖ అధికారి



దాదులూరు వద్ద అగ్నికి కమిలిపోయిన జామతోట



మామిళ్లపల్లి వద్ద చీనీతోట సమీపంలో ఎండు గడ్డి



అసంపూర్తిగా హెచ్చెల్సీ భవనాలు



శిథిలావస్థలో కార్యాలయాలు

అతిథి గృహంలో సిబ్బంది విధులు
కూటమి ప్రభుత్వంలో అయినా పూర్తయ్యేనా..?

కణేకల్లు, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): హెచ్చెల్సీకి ప్రధాన సబ్‌డివిజన్‌గా ఉన్న కణేకల్లులో హెచ్చెల్సీ భవనాలన్నీ అసంపూర్తిగా నిలిచిపోయాయి. దీంతో అధికారులు పరిపాలన సాగించడానికి అనేక అగచాట్లు పడాల్సి వస్తోంది. పాత భవనాలన్నీ శిథిలావస్థకు చేరుకోవడంతో ఇటీవల అధికారులు హెచ్చెల్సీ అతిథిగృహంలోకి కార్యాలయాన్ని మార్చారు. అది కూడా శిథిలావస్థకు చేరుకోవడంతో అధికారులు విధులు నిర్వహించడానికి అనేక ఇబ్బందులు పడుతున్నారు. 2009లో ఆధునికీకరణలో భాగంగా నాల్గవ ప్యాకేజీలో హెచ్చెల్సీ కార్యాలయంతో పాటు అధికారుల క్వార్టర్స్ నిర్మాణానికి రూ. 2 కోట్లు మంజూరు చేసింది. దీంతో అప్పటి కాంట్రాక్టర్లు ప్రధాన హెచ్చెల్సీ సబ్ డివిజన్ కార్యాలయాన్ని దాదాపు 80 శాతం మేర నిర్మించారు. అలాగే సిబ్బంది నివాసం ఉండేందుకు అవసరమైన క్వార్టర్స్‌లో ఒక దాన్ని నిర్మించగా మరికొన్ని పునాదిస్థాయిలో నిలిచిపోయాయి. నిధులు రాకపోవడంతో అవి అసంపూర్తిగా నిలిచిపోయాయి.



అర్ధంతరంగా ఆగిన హెచ్చెల్సీ కార్యాలయం

అధికారులకు తీవ్ర ఇబ్బందులు

హెచ్చెల్సీ సబ్‌డివిజన్ కార్యాలయంలో డీఈ, నలుగురు జేఈలు, సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్‌తో పాటు వాచ్‌మెన్‌లు, కార్యాలయ సిబ్బందితో పాటు లస్కర్లు కూడా ఉన్నారు. భవనాలు లేకపోవడంతో గతంలో అధికారులు చిన్నపాటి గదుల్లో పాలన సాగించేవారు. దాదాపు 25 కి.మీ. మేర సబ్ డివిజన్ కలిగి ఉన్న కణేకల్లుకు అనేక రికార్డులు, భూములు, నీటి సరఫరా వివరాల రికార్డులు ఉంటాయి. వాటన్నింటిని భద్రపరిచేందుకు గదులు లేక అధికారులు కూర్చోవడానికి స్థలం లేక ఇబ్బందులు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం హెచ్చెల్సీపై ప్రత్యేక దృష్టిసారించింది. ఇటీవలే హెచ్చెల్సీలోని పలు మరమ్మతుల కోసం రూ. 36 కోట్ల నిధులు మంజూరు చేసింది. అర్ధంతరంగా ఉన్న భవనాలను పూర్తి చేయాలని అధికారులు ఆశిస్తున్నారు.

పూర్తి చేస్తే బాగుంటుంది..



హెచ్చెల్సీ సబ్‌డివిజన్ కార్యాలయం దాదాపు 80 శాతం పూర్తయింది. ఫ్లోరింగ్, ఫర్నిచర్, కిటికీలు, వాకిళ్లు, లైటింగ్ వంటి 20 శాతం పనులు నిలిచిపోయాయి. వీటిని పూర్తి చేస్తే విధులు నిర్వహించడానికి అనుకూలంగా ఉంటుంది. హెచ్చెల్సీ సబ్‌డివిజన్‌కు భవనం లేక అతిథిగృహంలో కూర్చుని విధులు నిర్వహిస్తున్నాం.

- మద్దిలేటి, హెచ్చెల్సీ డీఈ, కణేకల్లు

చూసిన కనులదే భాగ్యము..

- నేడు కొండమీదరాయుడి బ్రహ్మరథోత్సవం
- ఉదయం 11:30 గంటలకు మడుగుతేరు



ముస్తాబైన రథం





కొండ మీదరాయుడు, అమ్మవార్ల ఉత్సవ మూర్తులు

బుక్కరాయసముద్రం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ కొండమీదరాయుడు స్వామి బ్రహ్మ రథోత్సవం బుధవారం వైభవంగా నిర్వహించనున్నారు. కొండమీదరాయ స్వామి వైభవాన్ని కనులారా చూసి తరించేందుకు భక్తుల పెద్ద సంఖ్యలో తరలిరానున్నారు. ఆలయ కమిటీ, గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. స్వామివారి బ్రహోత్సవాల ఏడోరోజు మాఘ శుద్ధ పౌర్ణమి సందర్భంగా శ్రీవారు బ్రహ్మరథంపై విహరిస్తారు. ఉదయం 11.30 నుంచి 12 గంటల వరకు మడుగు తేరు లాగుతారు. వేకువజామున స్వామి వారికి భూదేవి, శ్రీదేవి అమ్మవార్లతో కల్యాణం జరిపిస్తారు. అనంతరం స్థానిక లక్ష్మీనారాయణ స్వామి దేవాలయం నుంచి స్వామివారిని పల్లకి సేవలో రథోత్సవం వద్దకు తీసుకొస్తారు. ఉత్సవమూర్తులను రథంపై అధిష్ఠింపజేసి, తేరును లాగాతారు. ఉదయం మడుగు తేరును స్థానిక ఆంజనేయ స్వామి దేవాలయం వద్దకు లాగుతారు. సాయంత్రం 4.30కి ఆంజనేయస్వామి ఆలయం నుంచి బ్రాహ్మణ వీధి వరకు లాగి, తిరిగి యథాస్థానానికి చేరుస్తారు.

నేడు దేవరకొండపై అఖండ జ్యోతి

శబరిమల, అరుణాచలం తరహాలో ఏటా మాఘ పౌర్ణమి రోజున దేవరకొండపై అఖండ జ్యోతిని వెలిగించనున్నారు. ఆ మేరకు అఖండ జ్యోతి స్తూపాన్ని నిర్మించారు. రథోత్సవం అనంతరం సాయంత్రం 6.45 గంటలకు దేవరకొండపై అఖండజ్యోతి వెలిగిస్తారు. ఇందుకు 200 కిలోల నెయ్యిని విని యోగించనున్నారు.



నూతనంగా నిర్మించిన అఖండ జ్యోతి స్తూపం

శ్వేత గజవాహనంపై దేవదేవుడి వైభవం

కొండమీదరాయుడి బ్రహోత్సవాల్లో భాగంగా దేవదేవుడు శ్వేత గజవాహనంపై మంగళవారం విహరించారు. ఐశ్వర్యానికి ప్రతీక అయిన ఏనుగుపై కొలువుదీరి శ్రీవారు.. భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం నుంచి స్థానిక ఆంజనేయస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి, చిన్నరథంపై పురవీధుల్లో ఊరేగించారు. గజవాహన సేవ బుధవారం తెల్లవారుజాము వరకు కొనసాగింది.



గజవాహనంపై విహరిస్తున్న కొండమీదరాయుడు

బెదిరిస్తే.. సహించం

- కలెక్టర్, ఎస్పీకి ఫిర్యాదు చేస్తాం
- ఏపీ స్కూల్ ఎడ్యుకేషన్ సర్వీసెస్ అసోసియేషన్ నాయకులు



కార్యాలయ ఆవరణలో సంఘం నాయకులు

అనంతపురం విద్య, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): వ్యక్తిగత పనుల కోసం జిల్లా విద్యాశాఖాధికారి (డీఈఓ)ని బెదిరిస్తే సహించేది లేదని ఏపీ స్కూల్ ఎడ్యుకేషన్ సర్వీసెస్ అసోసియేషన్ నాయకులు హెచ్చరించారు. సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఉమ్మడి అనంతపురం డీఈఓ కార్యాలయాల్లో పనిచేస్తున్న అధికారులు, సిబ్బంది అనంతపురంలోని పాత డీఈఓ కార్యాలయం వద్ద భోజన విరామ సమయంలో సమావేశమయ్యారు. సంఘం జిల్లా అధ్యక్షుడు శ్యాంకుమార్ మాట్లాడుతూ... కొంతమంది టీచర్లు, ఎంఈఓలు.. సొంత పనుల కోసం డీఈఓ ప్రసాద్ బాబుపై బెదిరింపులకు దిగడం సరికాదన్నారు. కులసంఘాల పేరుతో తాము చెప్పిన వారికి పోస్టింగ్ ఇవ్వలేదంటూ డీఈఓను మానసికంగా ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి లోకేశ్వర్‌రెడ్డి, సహాధ్యక్షుడు పార్థసారథి, నాయకులు పాల్గొన్నారు.

హెచ్చెల్సీకి నీరు బంద్



సరిహద్దు వద్ద హెచ్చెల్సీలో తగ్గిన నీరు

రాయదుర్గం, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): తుంగభద్ర జలాశయం నుంచి జిల్లాకు అందుతున్న జలాలు మంగళవారం ఉదయం నుంచి ఆంధ్రా సరిహద్దులో తగ్గుముఖం పట్టాయి. సాయంత్రానికి సరిహద్దులో నీటిమట్టం పూర్తిగా పడిపోయింది. తుంగభద్ర ఎగువ కాలువ (హెచ్చెల్సీ)కి కోటా పూర్తవడంతో సరఫరాను సోమవారం రాత్రి నుంచి బోర్డు అధికారులు నిలిపివేశారు. తుంగభద్ర జలాశయం నుంచి హెచ్చెల్సీ కోటాగా 30.354 టీఎంసీల జలాలు అందాయి. జిల్లాకు తాగునీటి అవసరాల కోసం మూడు టీఎంసీలను కేసీ కెనాల్ కేటాయింపుల నుంచి హెచ్చెల్సీకి మళ్లించారు. జిల్లాకు ఈ ఏడాది మొత్తంగా 33.354 టీఎంసీల జలాలు హెచ్చెల్సీ నుంచి అందాయి. గతేడాది జూలై 24వ తేదీ నుంచి హెచ్చెల్సీకి నీరు విడుదల చేయగా.. ఫిబ్రవరి 10వ తేదీ వరకు కాలువలో నీటి ప్రవాహం నిరంతరాయంగా కొనసాగింది. కర్ణాటక, ఆంధ్ర నీటి వాటాను కలిపి సరిహద్దులోని 105 కి.మీ. వరకు తీసుకున్నారు. కర్ణాటక వాటా త్వరగా ముగిసిపోవడంతో డిసెంబరు, జనవరి నెలల్లో ఆఫ్ అండ్ ఆన్ పద్ధతిని కర్ణాటక అవలంబించింది. తద్వారా ఆంధ్ర వాటా నీరు మాత్రం సింగిల్ ఇండెంట్ కింద నిరంతరాయంగా తీసుకోవడంతో ఈ ఏడాది కొంత ప్రవాహ నష్టాన్ని భరించాల్సి వచ్చింది. అయినా గతంతో పోల్చితే ఈ ఏడాది జలాలు ఆశించినస్థాయి కంటే ఎక్కువగానే అందాయి. ఎగువన వర్షాలు సమృద్ధిగా కురవడంతో నీటి కొరత ఏర్పడలేదు. జలాశయం 19వ నంబరు క్రస్ట్‌గేట్ ఊడిపోయినప్పటికీ దీని ప్రభావం ఏమాత్రం హెచ్చెల్సీ వాటాపై పడలేదు. కొంతవరకు ఆందోళన కలిగించినా వర్షాలు కురిసి జలాశయం నిండడంతో కోటా నీరు పూర్తిగా అందింది. అంతరాయం ఏర్పడకుండా సరఫరా చేసుకోగలిగారు. ఖరీఫ్‌కు నీటి కొరత రాకుండా మెండుగా జలాలు అందాయి. జిల్లాలోని పీఏబీఆర్‌లో 3.650 టీఎంసీలు, ఎంపీఆర్‌లో 1.221 టీఎంసీలు, చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లో 8.00 టీఎంసీలు, మైలవరంలో 2.80 టీఎంసీలు, చాగల్లులో 0.802 టీఎంసీలు, పెండేకల్లులో 0.267 టీఎంసీలు, కణేకల్లు చెరువులో 0.325 టీఎంసీల నీరు నిల్వ ఉంది. హెచ్చెల్సీ ద్వారా అందిన జలాలను తాగునీటి అవసరాల కోసం ఆయా రిజర్వాయర్ల నిల్వ చేశారు. 195 రోజులపాటు హెచ్చెల్సీలో నీటిని జలాశయం నుంచి తీసుకుని జిల్లాలో తాగు, సాగునీటి సమస్య లేకుండా ఈ ఏడాది అధికారులు ప్రణాళిక ప్రకారం ముందుకెళ్లారు. తుంగభద్ర జలాశయంలో కూడా ఈ ఏడాది ఇప్పటివరకు 45.787 టీఎంసీల నీరు నిల్వ ఉంది. గతేడాది తొమ్మిది టీఎంసీలు మాత్రమే నిల్వ ఉండేది. నీటి లెక్కల ప్రకారం తాగునీటి అవసరాల కోసం మరికొన్ని జలాలను మళ్లించుకునేందుకు జలాశయంలో లెవల్ కూడా అనుమతించే పరిస్థితి ఉంది. ప్రభుత్వాలు.. ఆయా రాష్ట్రాలకు సంబంధించిన నీటిలో మిగులు జలాలు ఉంటే వాటిని హెచ్చెల్సీకి మళ్లించుకుని తాగునీటి అవసరాల కోసం నిల్వ చేసుకునేందుకు ప్రయత్నాలు చేసుకున్నా లాభదాయకంగా ఉంటుంది. చివరకు ఈ ఏడాది హెచ్చెల్సీ ద్వారా అందిన జలాలు సంతృప్తిని కలిగించాయని రైతాంగం ఆనందం వ్యక్తం చేస్తోంది.

అర్బన్‌లో 2,283 మందికి ఎన్టీఆర్ గృహాలు

గ్రామీణ ప్రాంతాల్లో నెలాఖరులోపు దరఖాస్తు చేసుకోవాలి: హౌసింగ్ పీడీ శైలజ

అనంతపురం క్లాక్‌టవర్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి ఆవాస్ యోజన-ఎన్టీఆర్ హౌసింగ్ కింద మున్సిపాలిటీల్లోని 2,283 ఇళ్లకు ప్రతిపాదనలు పంపినట్లు హౌసింగ్ పీడీ శైలజ మంగళవారం తెలిపారు. అందుకు సంబంధించిన ప్రతిపాదనలను ఆమె.. ఎండీ కార్యాలయానికి పంపారు. ఇందులో అనంతపురం 613, గుంతకల్లు 535, కళ్యాణదుర్గం 263, రాయదుర్గం 243, తాడిపత్రి 429, గుత్తి 200 మొత్తం 2,283 ఇళ్లకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. జాబితాలను ఇంజనీర్ల ద్వారా రాజధాని అమరావతికి అప్రూవల్ కోసం పంపారు. ఈ ఇళ్లకు కేంద్ర ప్రభుత్వం రూ.1.5 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం రూ.లక్ష, లబ్ధిదారుడి వాటా రూ.2లక్షలతో మొత్తం రూ.4.5 లక్షల యూనిట్ ధరను ప్రభుత్వం నిర్ణయించినట్లు పీడీ తెలిపారు. సొంత స్థలం ఉన్న వారికి మాత్రమే అర్బన్ హౌసింగ్ మంజూరు చేయనున్నట్లు పేర్కొన్నారు.



ప్రతిపాదనలను పరిశీలిస్తున్న హౌసింగ్ పీడీ శైలజ

నెలాఖరులోపు దరఖాస్తు చేసుకోవాలి

సొంత స్థలం ఉన్నవారు నెలాఖరులోపు ఆయా గ్రామ సచివాలయాల్లో పీఎంఏవై-ఎన్టీఆర్ హౌసింగ్‌కు దరఖాస్తు చేసుకోవాలని హౌసింగ్ పీడీ శైలజ తెలిపారు. వారి జాబితాను ఆయా ఎంపీడీఓలు, తహసీల్దార్లు, హౌసింగ్ ఏఈలు సభ్యులుగా ఉండే బృందం పరిశీలించి, పీడీ కార్యాలయానికి పంపుతారన్నారు. సొంత స్థలం కల్గిన అర్హులు దరఖాస్తు చేసుకోవాలని పీడీ సూచించారు.

చీనీ టన్ను రూ.22 వేలు


అనంతపురం రూరల్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ. 22వేలు పలికినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ. 6వేలు, సరాసరి రూ. 16,320 తో అమ్ముడు పోయినట్లు తెలిపారు. మార్కెట్‌కు మొత్తం 32 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.



నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

ఛార్లెస్ డార్విన్ (జయంతి)



జీవపరిణామ సిద్ధాంతాన్ని ప్రతిపాదించిన ప్రకృతి శాస్త్రవేత్త ఛార్లెస్ రాబర్ట్ డార్విన్ 1809 ఫిబ్రవరి 12న జన్మించారు. ఇంగ్లండ్‌కు చెందిన ఆయన గొప్ప ప్రకృతి శాస్త్రవేత్త. భూమిపై జీవజాలము ఏ విధంగా పరిణామక్రమం చెందినది అనే అంశంపై పరిశోధనలు చేశారు. ఒక మాతృక నుంచి సకలజీవరాశులు క్రమానుగతంగా పరిణామం చెందుతూ ఏర్పడ్డాయని ఈ చర్య నిరంతరంగా ఉంటుందని తొలిసారిగా వివరించినది ఛార్లెస్ డార్విన్ మాత్రమే. ప్రపంచవ్యాప్తంగా 400కుపైగా పురస్కారాలు పొందారు. 1882 ఏప్రిల్ 19న కన్నుమూశారు.

అబ్రహం లింకన్ (జయంతి)



ప్రపంచ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిన అమెరికా మాజీ అధ్యక్షుడు అబ్రహం లింకన్ 1809 ఫిబ్రవరి 12న జన్మించారు. జాతీయనేత, న్యాయవాది. అమెరికా సంయుక్త రాష్ట్రాల (యూఎస్‌ఏ)కు 16వ అధ్యక్షుడిగా 1861 నుంచి వ్యవహరించారు. అమెరికా అంతర్యుద్ధంలోనూ అత్యంత కార్యదక్షతతో పాలన సాగించారు. 1865 ఏప్రిల్ 15న హత్యకు గురయ్యాడు. లింకన్ గొప్పదనానికి గుర్తుగా అమెరికా కరెన్సీపై పెన్నీ, 5 డాలర్లపై ఆయన బొమ్మ ఉంటుంది.

రమా రవి (పుట్టినరోజు)



రమా రవి 1943 ఫిబ్రవరి 12న చెన్నైలో జన్మించారు. తల్లి తులసి సుబ్రమణియమ్ వద్ద సంగీతంలో తర్ఫీదు పొందారు. సంగీతం, భరతనాట్యంలలో పేరొందారు. ధనమ్మాల్ స్కూల్‌లో బోధనలు అందించారు. ఆలిండియా రేడియోలో ప్రముఖ కళాకారిణి. పండిట్ వినయ్‌చంద్ర మౌద్గాలయ వద్ద శిక్షణతో హిందూస్తానీ సంగీతంలో రాణించారు. మ్యూజిక్ అకాడమీ మద్రాస్‌చే 2012లో సంగీత కళా ఆచార్య పురస్కారం పొందారు.

రవికిరణ్ (పుట్టినరోజు)



నరసింహన్ రవికిరణ్ 1967 ఫిబ్రవరి 12న మైసూరులో జన్మించారు. దేశంలో పేరొందిన సంగీతకారుడు. తన ఐదవ యేటనే గాయనం, వాద్యకారుడిగా ప్రతిభను చాటుకున్నారు. స్వరకర్తగా రాణించారు. ఆలిండియా రేడియో, దూరదర్శన్‌లోనూ పలు కచేరీలు ప్రదర్శించారు. కంజీర, ఘటం, మృదంగంలలో సోలో, డ్యూయో ప్రదర్శనలు ప్రత్యేకం. పియానో, కీబోర్డ్, గిటార్, ఇతర వాదనలలోనూ రాణించారు. సంగీత చూడామణి, సంగీత కళానిధి, ఇతర పురస్కారాలు పొందారు.

అలరించిన విమాన విన్యాసాలు



లక్ష్యం దిశగా...



స్టాల్‌లో ఆసక్తిగా...

'మేక్ ఇన్ ఇండియా - మేక్ ఫర్ వరల్డ్' - డీఆర్‌డీఓ లక్ష్యం

బెంగళూరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): మేక్ ఇన్ ఇండియా సామర్థ్యంతో మేక్ ఫర్ వరల్డ్ అనేది డీఆర్‌డీఓ లక్ష్యమని పలువురు నిపుణులు అభిప్రాయపడ్డారు. వికసితభారత్‌వైపు డీఆర్‌డీఓ సంస్థల సమన్వయం అనే అంశంపై మంగళవారం చర్చాగోష్టి జరిగింది. డీఆర్‌డీఓ పెవిలియన్‌లో 9 విభాగాలుగా చేసి ప్రదర్శించారు. రక్షణరంగం, ఎయిర్‌ఫోర్స్ రాడార్ వ్యవస్థ, మానవ రహిత వైమానిక వ్యవస్థ, రాడార్ స్కేప్, మ్యాపింగ్ ద ఇన్విజిబుల్, కోస్ట్‌గార్డ్‌ఫ్లైట్‌తోపాటు 330కుపైగా ఉత్పత్తులను ప్రదర్శించారు. 14 సాంకేతిక విభాగాలుగా ఏర్పాటు చేశారు. వీటిపై జరిగిన చర్చాగోష్టిలో డీఆర్‌డీఓ ప్రతినిధులు మాట్లాడుతూ రక్షణారంగం సామర్థ్యం పెంచడంతోపాటు రక్షణా ఎగుమతులకు భారతీయ ప్రైవేట్ పరిశ్రమలు, స్టార్టప్‌ల సహకారంపై సమగ్ర చర్చలు సాగాయన్నారు. రక్షణా ఉత్పాదనా శాఖ సమర్థ్య అనే అంశంపై డీడీఆర్ కార్యదర్శి, డీఆర్‌డీఓ ఛైర్మన్ డాక్టర్ సమీర్ వీ కామత్ పాల్గొన్నారు. వివిధ పెవిలియన్‌లలో చర్చాగోష్టులు సాగాయి.

యలహంక ఎయిర్‌బేస్‌లో ఎటుచూసినా సందడే...

నగరంలోని యలహంక ఎయిర్‌బేస్‌లో జరుగుతున్న ఏరో ఇండియా 2025 ప్రదర్శనలో రెండోరోజు మంగళవారం పలు రకాల విమానాల విన్యాసాలు సందర్శకులను అలరించాయి. విమానాలు, రక్షణారంగ ఉత్పత్తులకు సంబంధించి ప్రత్యేక స్టాల్స్ ఏర్పాటు చేయగా చూపరులను సందడి చేశాయి. యుద్ధ విమానాలు, హెలికాప్టర్‌లు ఇతరత్రా నమూనాలు ఏర్పాటు చేశారు. వివిధరకాల డ్రోన్‌లు, విమాన విన్యాసాల వీక్షణకు అవకాశం కల్పించారు. ఎయిర్‌షోలో డీఆర్‌డీఓ రూపొందించిన ఫ్లైట్ టెస్ట్‌బెడ్ విమానం, ఎయిర్‌ఫోర్స్ విమానాలు, సూర్యకిరణ్ విమానాల విన్యాసాలు, త్రివర్ణ రంగులు వెదజల్లుతూ సందడి చేశాయి. మధ్యాహ్నం ఎండ అధికంగా ఉండడంతో సందర్శకులు గొడుగుల సాయంతో విన్యాసాలు వీక్షించారు. ఫోటోలు, సెల్ఫీలు తీసుకున్నారు.



యలహంక ఎయిర్‌బేస్‌లో విమానాలు



ఆకట్టుకుంటున్న డ్రోన్



ఫొటోలు తీసుకుంటున్న యువతులు



ప్రదర్శనకు సిద్ధంగా విమానం...

సౌభాగ్యం వద్దనుకుని..!

భర్తను హత్య చేయించిన భార్య

అనంతపురం క్రైం, ఫిబ్రవరి11(ఆంధ్రజ్యోతి): వివాహేతర సంబంధం నేపథ్యంతోనే మహిళ తన భర్తను హత్య చేయించినట్లు పోలీసులు వెల్లడించారు. అనంతపురం నగర శివారులోని చింతతోపులో ఈనెల రెండో తేదీన జరిగిన హత్య కేసును అనంతపురం రూరల్ పోలీసులు ఛేదించారు. శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరం మండలం మల్కాపురం గ్రామానికి చెందిన దేవరకొండ కాశప్ప హత్య కేసులో అతడి భార్య దేవరకొండ సౌభాగ్య, కర్ణాటక రాష్ట్రం కోలార్ సమీపంలోని బంగారుపేట్‌కు చెందిన నవాజ్‌బేగ్, కోలార్ పట్టణానికి చెందిన గౌస్‌పీర్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. అనంతపురం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్‌ఐ రాంబాబుతో కలిసి సీఐ శేఖర్ అరెస్ట్ వివరాలు వెల్లడించారు.

టమోటా మండీలో గొడవతో...

దేవరకొండ కాశప్ప అలియాస్ కాశి, అతడి భార్య సౌభాగ్య కక్కలపల్లి టమోటా మండీలో కూలీలతో మేస్త్రీ పని చేయించి తిరిగి గ్రామానికి వెళ్లేవారు. కాశప్ప మూడు నెలల కిందట తన పొలం అమ్మగా వచ్చిన డబ్బు తీసుకుని చీరల వ్యాపారం చేయడానికి హైదరాబాద్‌కు వెళ్లి అక్కడే ఉండి పోయాడు. అతడి భార్య సౌభాగ్య మాత్రం రోజూ వచ్చి పనులు చేయించి వెళ్లేది. ఈ క్రమంలో రెండు నెలల కిందట కర్ణాటక రాష్ట్రం కోలార్‌కు చెందిన నవాజ్‌బేగ్, గౌస్‌పీర్‌లు సౌభాగ్య దగ్గర పనికి చేరారు. ఈ క్రమంలో సౌభాగ్య, నవాజ్‌బేగ్ మధ్య వివాహేతర సంబంధం ఏర్పడింది. వారిద్దరి వ్యవహారం టమోటా మండీ మొత్తం తెలిసిపోయింది. ఈ విషయం కాశప్పకు కూడా తెలియడంతో గొడవపడ్డాడు. ఈ నేపథ్యంలో ఇద్దరినీ చంపుతానని హెచ్చరించాడు. దీంతో తమ తమ వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్న భర్తను తొలగించుకుంటే ప్రియుడితో హాయిగా ఉండొచ్చని సౌభాగ్య భావించింది. నవాజ్‌తో చర్చించి, గౌస్‌తో కలిసి భర్తను హత్య చేయాలని కోరింది. ఈనెల 1వతేదీ స్థానిక కియ మోటార్స్ ఎదురుగా ఉన్న చింతతోపులోకి కాశప్పను నవాజ్, గౌస్ నమ్మించి తీసుకెళ్లారు. అక్కడ మద్యం తాగించారు. ఆమత్తులో ఉండగానే ఖాళీ బీరు బాటిల్, బండరాయితో మోది హత్య చేశారు. ఎవరికీ అనుమానం కలగకుండా ఉండేందుకు సౌభాగ్య స్థానిక పోలీసులకు తన భర్తను గుర్తు తెలియని వ్యక్తులు హత్య చేశారని ఈనెల మూడో తేదీ రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు రూరల్ డీఎస్పీ వెంకటేశులు ఆదేశాల మేరకు దర్యాప్తు ప్రారంభించారు. ప్రత్యేక బృందాలుగా ఏర్పడి కేసు ఛేదించారు. సీఐ శేఖర్‌కు సమాచారం అందడంతో స్థానిక ఆర్డీటీ స్టేడియం సమీపంలో ఎస్‌ఐ రాంబాబు, సిబ్బందితో కలిసి ఈ ముగ్గురిని అరెస్ట్ చేశారు.




హత్య కేసు వివరాలు వెల్లడిస్తున్న సీఐ శేఖర్



సిద్ధమైన హెలిప్యాడ్

హంపి ఉత్సవాలకు ముస్తాబవుతున్న వేదికలు

కంప్లి, ఫిబ్రవరి 11 (ఆంధ్ర జ్యోతి) : విశ్వవిఖ్యాత హంపి ఉత్సవాలు ఎట్టకేలకు ఈ నెల 28 నుండి మార్చి రెండు వరకు హంపి ఉత్సవాలు జరుగుతున్నట్లు జిల్లా అధికారులు తెలిపారు. ఇప్పటికే జిల్లా ప్రజాప్రతినిధులు ఉత్సవాలు లోగోను విడుదల చేశారు. మూడు రోజుల నుండి ఎంపీలు వేదికలు కూడా పనులు కూడా ప్రారంభమయ్యాయి. ప్రధాన వేదిక గాయత్రి వేదికతో పాటు మరో నాలుగు వెదురుకలు ముస్తాబ్ చేపడుతున్నారు. జిల్లా అధికారులు హంపి ఉత్సవాలపై దృష్టి సాధించారు. గజశాల వద్ద ధ్వని, వెలుగు వేదిక కార్యక్రమాలు జోరుగా సాగుతున్నాయి. అలాగే కమలాపురంలో భువనేశ్వర్ హోటల్, రంగనంలో హెలికాప్టర్ బైస్కై హెలిప్యాడ్ పనులు కూడా జోరుగా సాగుతున్నాయి. ఇప్పటికే బైస్కై బుకింగ్ ప్రారంభమైందని తెలిపారు. యేడాది మార్చి నెలలో హంపి ఉత్సవాలు వుండటంతో పర్యాటకులు ఎండ వేడిమిని తట్టుకుని ఉత్సవాలకు తరలివస్తారా లేదా అనే అంశంపైన అధికారులు దృష్టి సారించారు. ప్రతిసారి నవంబరు, డిసెంబరు నెలలో ఉత్సవాలు జరిగేవి. ఎండ ప్రభావం తక్కువగానే వుండేది రాష్ట్రం నలమూలల నుండి ఎంపీ ఉత్సవాలకు తరలివచ్చి ఆనందం వ్యక్తపరచుకునేవారు. ఈ యేడాది ఉత్సవాల్లో ఎంతవరకు ఉత్సవాలు తిలకించడానికి ప్రజలు పాల్గొంటారన్నారు. ఎంపీలు, ప్రముఖ నాయకులకు, అధికారులకు గుర్తింపు నిస్తాయా అనేది తెలుస్తుందన్నారు.



ఇంట్లో చోరీ.. నగల అపహరణ

కుందుర్పి, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగేపల్లికి చెందిన పుట్టమ్మ ఇంట్లో సోమవారం రాత్రి దొంగలు పడ్డారు. పుట్టమ్మ కుటుంబ సభ్యులంతా జీవనోపాధి కోసం బెంగళూరు వెళ్లారు. ఆమె ఒక్కరే ఇంటి వద్ద ఉంటోంది. భోజనం చేసుకుని, సమీప బంధువుల ఇంటికెళ్లి రాత్రికి బస చేసి, ఉదయమే ఇంటికెళ్తుంది. సోమవారం రాత్రి కూడా ఇంటికి తాళం వేసుకుని, బంధువుల ఇంటికెళ్లింది. అర్ధరాత్రి సమయంలో దొంగలు వెనుక వైపున కిటికీ ఇనుప కడ్డీలను ధ్వంసం చేసి, లోపలికి చొరబడ్డారు. కప్‌బోర్డులోని దుస్తులను చిందరవందర చేసి, అందులోని రూ.1.50 లక్షల విలువ చేసే కమ్మలు ఇతరత్రా ఆభరణాలు అపహరించారు. దీనిపై బాధితురాలు మంగళవారం స్థానిక పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేసింది. దీనిపై విచారిస్తున్నట్లు ఎస్‌ఐ నగేశ్ తెలిపారు.

భూసేకరణను వ్యతిరేకిస్తూ రైతుసంఘం రాస్తారోకో

ట్రాఫిక్‌జామ్‌తో ప్రయాణికుల అవస్థలు

దొమ్మసంద్ర, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ఆనేకల్ తాలూకా సర్జాపుర హోబళిలో కర్ణాటక ఇండస్ట్రియల్ ఏరియా డెవలప్‌మెంట్ బోర్డ్ (కేఐఏడీబీ) ఆధ్వర్యంలో భూస్వాధీన ప్రక్రియ చేపట్టడాన్ని వ్యతిరేకిస్తూ ఆనేకల్ భూస్వాధీన వ్యతిరేక పోరాట సమితి, కర్ణాటక రాష్ట్రరైతు సంఘం, హసిరుసేన సంయుక్తంగా మంగళవారం భారీ నిరసన నిర్వహించాయి. దొమ్మసంద్ర సర్కిల్‌లో రాస్తారోకో నిర్వహించారు. కేఆర్‌ఎస్ పార్టీ ముఖ్యుడు రవికృష్ణారెడ్డి మాట్లాడుతూ బెంగళూరు చుట్టుపక్కల సాగుభూమి తగ్గుతోందన్నారు. పూలు, పండ్లు, కూరగాయలు, తృణధాన్యాలు ఇతర రకాల పంటలు పండించే భూమి తగ్గిపోతోందన్నారు. పంటలు పండిస్తున్న భూమిని పరిశ్రమల పేరిట బలవంతంగా లాక్కుంటున్నారని ఇది సరైన చర్య కాదన్నారు. కన్నడ జాగృతి వేదిక రాష్ట్ర అధ్యక్షుడు మంజునాథ్‌దేవ మాట్లాడుతూ రైతుల పోరాటాలకు కన్నడ సంఘాల మద్దతు ఉంటుందన్నారు. మన అస్తిత్వాన్ని కాపాడుకోవడానికి, రైతుల జీవనం కోసం ప్రభుత్వాలు అండగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. దేశానికి వెన్నెముగా పేర్కొంటున్న అన్నదాతలు ఇటీవలికాలంలో అన్యాయానికి గురవుతున్నారని విచారం వ్యక్తం చేశారు. వీసీకే పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఎంసీ హళ్ళి వేణు మాట్లాడుతూ రైతులకు అండగా ఉండాల్సిన పరభుత్వాలు రైతు వ్యతిరేకంగా వ్యవహరించడం బాధాకరమన్నారు. రైతులు భూమిని నమ్ముకుని జీవనం సాగిస్తున్నారన్నారు. హసిరుసేనకు చెందిన కోడిహళ్ళి చంద్రశేఖర్ మాట్లాడుతూ గతంలో ప్రభుత్వాలు వందలాది ఎకరాలు భూస్వాధీనం చేసుకున్నాయన్నారు. కాగా రైతుల సాగు భూమిని వారినుంచి అనుమతి లేకుండా బలవంతంగా లాక్కుంటున్నారని దీనికి స్విఫ్ట్‌సిటీ అని పేరు పెట్టారన్నారు. రాస్తారోకోతో సుమారు మూడు గంటలపాటు ట్రాఫిక్‌జామ్ నెలకొంది. నిరసనలో కరవే రాష్ట్ర ఉపాధ్యక్షుడు జిగణి పునీత్, జయ కర్ణాటక సంఘం తాలూకా అధ్యక్షుడు కిరణ్ ప్రభాకరరెడ్డి, ప్రముఖులు టీవీ బాబు, దొమ్మసంద్ర, జయణ్ణ, సర్జాపుర, మునిరాజు, కేపీ రాజు, ఆనేకల్ తాలూకా భూస్వాధీన వ్యతిరేక పోరాట సమితి గౌరవాధ్యక్షుడు జయప్రకాశ్, భూస్వాధీన పోరాట సమితి అధ్యక్షుడు దేవరాజ్ వందలాది మంది రైతులు, చుట్టుపక్కల ప్రాంతాల వారు స్థానికులు పాల్గొన్నారు.



రాస్తారోకోలో రైతుసంఘం నాయకులు, సభ్యులు

ఎమ్మెల్సీ బరిలో ఉన్నా: ఉగ్రప్ప

బొమ్మనహళ్ళి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): విధానపరిషత్‌లో ఖాళీగా ఉన్న నాలుగు స్థానాలకు త్వరలో ఎన్నికలు జరిగే అవకాశం ఉందని తాను కూడా ఎమ్మెల్సీ రేసులో ఉన్నానని మాజీ ఎంపీ వీఎస్ ఉగ్రప్ప తెలిపారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ గతంలో తాను ఎమ్మెల్సీగాను, ఎంపీగాను వ్యవహరించానన్నారు. త్వరలో జరిగే ఎన్నికల్లో ఎమ్మెల్సీ పదవిని ఆశిస్తున్నా అన్నారు. కాగా రెడ్డి సామాజికవర్గం నుంచి రాష్ట్ర తొలి సీఎం కేసీ రెడ్డి మనువరాలు వసంత కవితారెడ్డి కూడా ఉన్నారన్నారు. సుదీర్ఘకాలంగా కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతున్నారని ఆమెకు కూడా పార్టీ సముచితంగా గుర్తించే అవకాశం ఉందన్నారు. కాగా నాలుగుస్థానాల రేసులో రమేశ్‌బాబు, అమీన్‌మట్టు వంటి వారి పేర్లు వినిపిస్తున్నాయి.



మాజీ ఎంపీ ఉగ్రప్ప

గంగమ్మ దేవాలయ వార్షికోత్సవం

శిడ్లఘట్ట, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): తాలూకాలోని మళమాచనహళ్ళి గ్రామంలోని గంగమ్మ దేవాలయ మూడో వార్షికోత్సవం మూడు రోజులపాటు ఘనంగా జరిగింది. ఆది, సోమ, మంగళవారాలలో విశేషపూజలు నిర్వహించారు. ఆలయంలో మునేశ్వర స్వామి, అక్కయమ్మ విగ్రహాలు కూడా ఉన్నాయి. మూల విరాట్టులకు, ఉత్సవమూర్తులకు అభిషేకం, అలంకరణ చేశారు. మహామంగళారతి అనంతరం అన్నసంతర్పణ నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



విశేష అలంకరణ

శస్త్రచికిత్స విజయవంతంపై హర్షం

మహదేవపుర, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): గాల్‌బ్లాడర్ (పిత్తాశయం)లో నొప్పితో బాధపడుతున్న వ్యక్తికి నిర్వహించిన చికిత్స విజయవంతమైందని వైట్‌ఫీల్డ్‌లోని మెడికవర్ ఆసుపత్రి వైద్యబృందం ప్రకటించింది. తీవ్రమైన కడుపు నొప్పి, వాంతులు, జ్వరంతో బాధపడుతున్న 56ఏళ్ల అబ్దుల్‌సలాం ఆసుపత్రిలో చేరగా సిటీస్కాన్ చేయడంతో పిత్తాశయంలో పెద్దరాళ్లు ఉన్నట్టు గుర్తించామన్నారు. రక్తపరీక్షలో మధుమేహం, కిడ్నీ సమస్య ఉండడంతో ఆపరేషన్ సవాల్‌గా మారిందని అయితే ఎట్టకేలకు కన్సల్టెంట్ ల్యాప్రోస్కోపిక్, లేజర్, రోబోటిక్ సర్జన్ డాక్టర్ షేక్ జావీద్‌హుసేన్ నేతృత్వంలో శస్త్రచికిత్స నిర్వహించినట్టు తెలిపారు. డాక్టర్ విన్సి సర్జికల్ సిస్టమ్‌ద్వారా ఎంతో క్లిష్టమైన ఆపరేషన్ చేశారన్నారు. ప్రస్తుతం రోగి కోలుకుంటున్నట్టు తెలిపారు.



కోలుకున్న రోగితో వైద్యబృందం

ఈ సందర్భంగా డాక్టర్ రాజసెల్వరాజన్, డాక్టర్ మోనికాగుప్తా, రోగి కుటుంబీకులు తదితరులు పాల్గొన్నారు.

15వరకు ఈ-కేవైసీకి అవకాశం

శిడ్లఘట్ట, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): చౌకదుకాణాల ద్వారా రేషన్ పొందుతున్న కార్డుదారుల కుటుంబ సభ్యులు ఈనెల 15లోగా ఇ-కెవైసి చేసుకోవాలని తహసీల్దారు బీఎస్ స్వామి సూచించారు. రేషన్‌కార్డులోని సభ్యులందరూ తప్పక ఇ-కెవైసి చేయించుకోవాలన్నారు. కుటుంబ పెద్దగా ఉండేవారు మొబైల్‌సంఖ్య, గ్యాస్ కనెక్షన్ నమోదు వంటి వివరాలు పొందుపరచాల్సి ఉంటుందన్నారు. తాలూకాలోని అంత్యోదయ, ఇతర రేషన్ కార్డుదారులు ఇ-కెవైసి కోసం ఆధార్‌కార్డు, ఎల్‌పిజి కనెక్షన్, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలతో సంబంధిత చౌకదుకాణాలలో నమోదు చేసుకోవాలని సూచించారు.

సైన్స్ ప్రదర్శనలో హైస్కూల్ విద్యార్థుల సత్తా

శిడ్లఘట్ట, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): తాలూకాలోని మిట్టేమరి ప్రభుత్వ హైస్కూల్‌లో యునైటెడ్ వే బెంగళూరు, బీఈఓ కార్యాలయం బాగేపల్లి సంయుక్తంగా నిర్వహించిన తాలూకాస్థాయి సైన్స్ ప్రదర్శనలో 50కుపైగా ప్రాథమికోన్నత, హైస్కూల్ విద్యార్థుల జట్లు పాల్గొన్నాయి. హైస్కూల్ విభాగంలో ఘంటంవారిపల్లికి చెందిన ప్రభుత్వ హైస్కూల్ విద్యార్థులు ప్రథమస్థానంలో నిలిచి సత్తా చాటుకున్నారు. 9వ తరగతి విద్యార్థులు సందీప్, దినేశ్‌లు రూపొందించిన 'హసిరుమనె పరిణామ నియంత్రణ' మాదిరిగా నిలిచి ప్రథమ బహుమతి దక్కించుకుంది. విద్యార్థులలో పరిశోధనాభావాలు, సృజనాత్మక ఆలోచనలకు అవకాశం కల్పించేలా ప్రదర్శనలు చక్కటివేదికగా ఉన్నాయని ఉపాధ్యాయులు అభిప్రాయపడ్డారు. తాలూకాకు కీర్తితెచ్చిన సందీప్, దినేశ్‌లను ఉపాధ్యాయుడు రవి, ప్రధానోపాధ్యాయురాలు రామసుబ్బమ్మ, బీఈఓ వెంకటప్ప తదితరులు అభినందించారు.




విద్యార్థులకు జ్ఞాపిక అందజేత

గంజాయి స్వాధీనం : మహిళ అరెస్టు

చింతామణి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి అనుబంధంగా ఉన్న కీర్తినగర్ లే అవుట్‌లోని ఒక ఇంటిపై పోలీసులు దాడి చేసి రూ.1.50 లక్ష విలువైన 5కేజీల 720 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పట్టణ పోలీసులు నిర్వహించిన దాడులలో గంజాయిని స్వాధీనం చేసుకుని ఒక మహిళను అరెస్టు చేసి జ్యుడీషియల్ కస్టడీకి తరలించారు. నిందితురాలు షబనాపై ఇప్పటికే ఏడు కేసులు ఉన్నాయని, ఖచ్చితమైన సమాచారం మేరకు దాడులు నిర్వహించినట్టు ఎస్సైలు నారాయణస్వామి, షహబుద్దీన్‌లు తెలిపారు.



స్వాధీనం చేసుకున్న గంజాయి



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1617.06	1,588.39
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	0	0
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	10.137	442
నీటి నిల్వ (టీఎంసీలు)	53.47	9.74



మంటల్లో కాలిపోతున్న చెట్లు

అడవికి నిప్పు..!

- కాలి బుగ్గి అవుతున్న వృక్షాలు
- ప్రాణాపాయ స్థితిలో వన్యజీవులు
- అటవీశాఖ అధికారులు ప్రయత్నిస్తున్నా ఆరని మంటలు

బళ్లారి, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): జిల్లా లోని సండూరు వద్ద ఉన్న సుల్తాన్‌పుర ఫారెస్టులో అడవిలో అగ్గి రాజుకుంది. సోమవారం రాత్రి చిన్నగా అంటుకున్న నిప్పు కణికలు మంగళవారానికి ఉధృతంగా మారి పలు చెట్లను కాల్చేశాయి. సండూరు వద్ద ఉండే ఈ ఫారెస్టు అత్యంత దట్టమైనది, ఇందులో పెద్ద వృక్షాలతో పాటు పలు వన్యప్రాణులు జీవనం సాగిస్తున్నాయి. సోమవారం రాత్రి ఎవరో నిప్పు రగిల్చినట్లు తెలుస్తోంది. చలి మంట కోసం నిప్పు పెట్టారా.. లారీడ్రైవర్లు ఎవరైనా బీడీ, సిగరెట్లు తాగి పడేశారా అని అధికారులు ఆరా తీస్తున్నారు. కొండల కింద బాగంలో అయితే అటవీ శాఖ అధికారులు నీరు వేసి ఆర్పుతున్నారే కానీ కొండ పై బాగంలోనూ మంటలు ఆర్పడం సాధ్యం కావడం లేదు. రాత్రి వరకు అగ్నిమాపక శాఖ, అటవీ శాఖ అధికారులు మంటలు ఆర్పే ప్రయత్నం చేస్తూనే ఉన్నారు. అయినా అదుపులోకి రాలేదు.

మాజీ మంత్రి పుణ్య స్నానం



పూజల్లో శ్రీరాములు దంపతులు

బళ్లారి రూరల్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి శ్రీరాములు కుటుంబ సమేతంగా సోమవారం ఉత్తరప్రదేశ్ ప్రయాగరాజ్ మహా కుంభమేళాలో పూజలు నిర్వహించారు. అనంతరం పలు పుణ్యక్షేత్రాలు దర్శించుకున్నట్లు ఆయన కార్యాలయ ప్రతినిధులు నగరంలో ప్రకటించారు.

నేడు రథోత్సవాలు

సిరుగుప్ప, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): గ్రామ దేవత గాంధమ్మదేవి, రారావి యల్లమ్మ అమ్మవార్ల మహారథోత్సవాలు బుధవారం జరుగనున్నాయి. ప్రతి యేడాది మాఘ పౌర్ణమిని పురస్కరించుకుని రథోత్సవాలు జరగడం ఆనవాయితీ. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కమిటీ సభ్యులు తెలిపారు.

నేడు కోట మల్లేశ్వర స్వామి బ్రహ్మరథోత్సవం

బళ్లారి గాంధీనగర్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): బళ్లారి నగర ప్రజల ఆరాధ్య దైవం కోట మల్లేశ్వర స్వామి బ్రహ్మ రథోత్సవానికి ఆలయ కమిటీ ఏర్పాట్లు సిద్ధం చేశారు. కోట ప్రాంతంలో వెలసిన కోట మల్లేశ్వరుడి ఆలయానికి రంగురంగుల విద్యుత్ దీపాలు అలకరించగా, ఆలయ ప్రాంగణంలో ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఏటా మాఘమాసం పౌర్ణమి రోజున మల్లేశ్వర స్వామి బ్రహ్మ రథోత్సవం అనంతరం శివరాత్రి వరకు జాతర ఉత్సవాలు జరపడం ఆనవాయితీ . ఆలయం కోట ప్రాతంలో ఉన్నా... రథోత్సవం తేరువీధిలో జరగడం విశేషం.

ఐదు దశాబ్దాల చరిత్ర

మల్లేశ్వరుడి జాతరకు ఐదు దశాబ్దాల చరిత్ర ఉందని చరిత్ర కారులు చెబుతున్నారు. స్థల పురాణం ప్రకారం బళ్ళారి తాలూకా పరిధిలోని కోళూరు గ్రామానికి చెందిన మల్లయ్య పరమ శివ భక్తుడు. మల్లప్ప పుట్టుకతో అంధుడైనా నిత్యం శివుడికి పూజలు చేయనిదే భోజనం చేసేవాడు కాదు. మల్లయ్య వ్యాపార నిమిత్తం తోటి మిత్రులతో కలిసి బళ్ళారి నగరంలోని కోట ప్రాంతానికి వచ్చారు. అయితే ఓ రోజు సాయంత్రం కావడంతో కోట ప్రాంతంలోనే మిత్రులతో కలిసి సేద దీరాడు. ఉదయం మల్లయ్య శివుడికి పూజలు నిర్వహించేందుకు చుట్టుప్రక్కల తిరిగినా ఎక్కడా శివాలయం కనిపించలేదు. అలా రెండు రోజుల పాటు శివుడికి పూజలు లేకపోవడంతో మల్లయ్య ఉపవాసం చేశాడు. మల్లయ్య పరిస్థితి గమనించిన మిత్రులు వ్యాపారం కోసం వెంట తెచ్చుకున్న సేరు(బల్ల)ను కోట ప్రాంతంలో ఓ రాయి(హరి)పై తలకిందులుగా చేసి మల్లయ్యకు శివలింగాన్ని తెచ్చామని, పూజలు చేయమని కోరారు. మిత్రుల మాట నమ్మి మల్లయ్య చేతితో సేరును శివలింగంగా భావించి మనసులో శివుడిని ధ్యానం చేస్తూ పూజలు అనంతరం మల్లయ్య ఉపవాసాన్ని విరమించినట్లు కథనం. అనంతరం రాతిబండపై బోర్లించిన సేరు తరువాత తీయడానికి రాలేదని... దీంతో ఆ ప్రాంతాన్ని శివుడు కొలువైనట్లు ప్రాంతంగా ప్రాచుర్యంలోకి వచ్చినట్లు స్థల పురాణం చెబుతోంది.

నాటి బల్లహరే.. నేటి బళ్లారి

బల్ల హరి ప్రాంతంలోనే ప్రస్తుతం నిర్మాణమైన మల్లేశ్వర ఆలయంగా దినదినాభివృద్ధి చెందుతూ... బళ్లారి ఆరాధ్య దైవంగా కోటమల్లేశ్వరుడు నగర ప్రజల పూజలు అందుకుంటున్నారు. మొదట బల్ల హరిగా ఈ ప్రాంతానికి పేరు నామకరణం చేయగా... అనంతరం ఆ పేరు కాస్త బళ్ళారిగా రూపాంతరం చెందిందని చెబుతారు. మల్లయ్యతో ఈ దేవస్థానానికి మల్లేశ్వరుడిగా పేరు వచ్చినట్లు చరిత్ర కారులు అభిప్రాయ పడుతున్నారు. ఏటా మాఘశుద్ధ పౌర్ణమి రోజున కోటమల్లేశ్వరుడికి రథోత్సవం నిర్వహించాలని పూర్వీకులు నిర్ణయించగా... ఆ ఆచారం నేటికీ కొనసాగుతుండడం విశేషం. కోట ప్రాంతంలో రథోత్సవం నిర్వహించడానికి వీలు లేకపోవడంతో బ్రిటీష వారి కాలంలో జనసంచారం కలిగిన ప్రాతమైన బ్రూస్‌పేట, మిల్లార్ పేట ప్రాంతంలో నిర్వహించేందుకు గతంలో పెద్దలు నిర్ణయించారు. ప్రస్తుతం ఆ ప్రాంతం అంతా తేరు వీధిగా మారిపోయింది. జాతర మహోత్సవం కార్యక్రమాల్లో భాగంగా ఫిబ్రవరి 6వ తేదీ నుంచే ఉత్సవాలు ప్రారంభమై ఈ నెల 26వ తేదీ వరకు కోట మల్లేశ్వర స్వామి దేవాలయం ముందు ఉత్సవాలు జరపడం ఆనవాయితీ. గురువారం సాయంత్రం జరిగే బ్రహ్మరథోత్సవం తిలకించడానికి బళ్లారి జిల్లాతో పాటు పొరుగు జిల్లాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి మొక్కుబడులు తీర్చుకోవడం విశేషం.

ఘనంగా కల్యాణోత్సవం

బళ్లారి సిటీ : నగర ఆరాధ్య దైవం కోట మల్లేశ్వరస్వామి కల్యాణమహోత్సవం, గంగా హారతి, గజవాహనోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. బుధవారం సాయంత్రం బ్రహ్మరథోత్సవం జరుగనుంది. నగరంలోని ప్రధాన వీదిలో రథోత్సవ జరుగుతుందని ఆలయ కార్యనిర్వహణాధికారి హనుమంతప్ప తెలిపారు. మహాశివరాత్రిలో భాగంగా 26న అభిషేకం, ప్రత్యేక పూజలు, భజనలు నిర్వహించనున్నట్లు తెలిపారు.



కల్యాణాన్ని నిర్వహిస్తున్న పండితులు

అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే భూమిపూజ



భూమిపూజలో ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి

బళ్లారి రూరల్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి) : నగరంలో గాంధీనగర్ రహదారి అభివృద్ధి కోసం రూ.13 లక్షలు, మోబైల్‌తో 22వ వార్డులో రూ. 37 లక్షల నిధులతో భూమిపూజ, అదేవిధంగా వార్డుల్లో డ్రైనేజీపనులకు సిటీ ఎమ్మెల్యే నారా భరత్ రెడ్డి మంగళవారం భూమిపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహానగర పాలిక మేయర్ నందీష్, ఉప మేయర్, సభ్యులు కుబేర, జబ్బర్, రామాంజనేయులు, హనుమంతు, మాజీ మేయర్ రాజేశ్వరి, మల్లన్నగౌడ, కాంగ్రెస్ నాయకులు మహమ్మద్, శివరాజ్, సుబ్బరాయుడు, పి జగన్నాథ్ పాల్గొన్నారు.

రెండో రోజూ కొనసాగిన నిరసనలు

కంప్లి, ఫిబ్రవరి 11(ఆంధ్ర జ్యోతి): కంప్లి పట్టణంలో తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో గ్రామ లెక్క అధికారులు నిరసనలు రెండో రోజుకి చేరింది. ఈ సందర్భంగా గ్రామలెక్కల అధికారుల సంఘం అధ్యక్షులు మంజునాథ్ మాట్లాడుతూ తమసమస్యలు పరిష్కరించే వరకు ఈ నిరసనలు ఆగవన్నారు. గ్రామ లెక్కల అధికారులకు నిరసన మద్దతుగా రైతు సంఘం మద్దతు పలికింది. ఏ విధంగా ఈ మంగళవారం నిరసన కార్యక్రమంలో రైతు సంఘాలు నాయకులు పాల్గొని గ్రామ లెక్క అధికారులు మద్దతు కల్పించారు. ఈ సందర్భంగా తాలుకా రైతు సంఘం అధ్యక్షులు వీరేష్ శివప్ప నాయక్ గ్రామాల్లో విధులు నిర్వహించే గ్రామ అధికారులు సరైన సౌకర్యాలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వాటిని వెంటనే ప్రభుత్వం పరిష్కరించి సమస్యలు తలెత్తకుండా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు రమేష్ గంగన్న, మురారి సుదర్శన్ మరో గ్రామ లెక్క అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నకిలీ నోట్ల చలామణి కేసులో

నలుగురి అరెస్టు

- నకిలీ రూ.30వేలు.. ఒరిజినల్ నోట్లు రూ. 20,500 స్వాధీనం

పుట్టపర్తిరూరల్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): నకిలీ నోట్లు చలామణి చేసిన నలుగురిని అరెస్టు చేసినట్లు ఎస్పీ రత్న పేర్కొన్నారు. వారి నుంచి రూ.30వేల నకిలీ కరెన్సీ నోట్లు, రూ.20500 ఒరిజినల్ నోట్లు, రెండు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. జిల్లా పోలీసు కార్యాల యంలో కేసు సంబంధించిన వివరాలను ఆమె మీడియాకు మంగళవారం వెల్లడించారు. గత నెల ఏడున కదిరి మండలం కుమ్మరవాండ్లపల్లి మార్కెట్‌లో ఇద్దరు ముదిగుబ్బ గ్రామానికి చెందిన జెన్నేపల్లి నాగేష్ నుంచి రెండు పొట్టేళ్లను రూ.30వేలకు కొన్నారు. ఈ సందర్భంగా 500 రూపాయల నోట్లు 60 ఇచ్చి వెళ్లిపోయారు. తర్వాత అవి నకిలీవి అని తెలుసుకున్న నాగేష్ కదరి రూరల్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి కదిరి డీఎస్పీ శివన్నారాయణ పర్యవేక్షణలో సీఐ నిరంజన్‌రెడ్డి సిబ్బందితో నిందితుల కోసం గాలించారు. వివిధ సీసీపుటేజీలను పరిశీలించి సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి మంగళవారం ఉదయం కుమ్మరవాండ్లపల్లి మార్కెట్ వద్ద కర్ణాటకకు చెందిన నలుగురు వ్యక్తులను అరెస్టు చేశారు. అరెస్టయిన వారిలో ఇస్లావత్ పిరోలినాయక్, దుంగావత్ రవినాయక్, ఎంపీ ఆనంద్‌నాయక్, ఆదినారాయణనాయక్‌లను అరెస్టు చేసినట్లు తెలిపారు. నకిలీ నోట్లు చలామణి చేసిన వ్యక్తులను అరెస్టు చేయడంలో కీలకంగా వ్యవహరించిన కదిరిరూరల్ అప్‌గ్రేడ్ పోలీసుస్టేషన్ సీఐ నిరంజన్‌రెడ్డి, సిబ్బంది విజయ్‌భాస్కర్, షహీన, దామోదర్, రవికుమార్‌నాయక్, జిల్లా స్పెషల్‌టీంని అభినందించి క్యాష్ రివార్డులతో పాటు ప్రశంసాపత్రాలను జిల్లా ఎస్పీ అందచేశారు.



మొక్కకు నీరు పోసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సీఈఓ రాహుల్ శరణప్ప

ఇంటర్నెట్‌ను బాధ్యతగా వాడుకోవాలి

- పిల్లలు దుర్వినియోగం చేయరాదు: జడ్పీ సీఈఓ

బళ్లారి సిటీ, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): అధికారులు , సిబ్బంది సాదారణ ప్రజలు సహా ప్రతి ఒక్కరూ ఇంటర్నెట్‌ను సురక్షితంగా నైతికంగా, బాధ్యతాయుతంగా ఉపయోగించాలని జిల్లాపంచాయతీ ముఖ్య కార్యానిర్వహణాధికారి రాహుల్ శరణప్ప తెలిపారు. జిల్లాయంత్రాంగం, జిల్లాపంచాయుతీ, జాతీయ సమాచార విజ్ఞాన కేంద్రం, పోలీసు శాఖ(సైబర్‌సెల్) సంయుక్తంగా నిర్వహించిన ' సేఫ్ ఫర్ ఇంటర్నెట్' వేడుకల్లో బాగంగా మంగళవారం పంచాయతీ హాల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. సాంకేతికత , ఇంటర్నెట్‌ను సురక్షితంగా వాడకంపై అవగాహన కల్పిస్తూ ఏటా సురక్షిత ఇంటర్నెట్ దినోత్సవాన్ని జరుపుకుంటారు. ఈ సంవత్సరం నినాదం'కలిసి మెరుగైన ఇంటర్నెట్ వైపు' అని ఆయన అన్నారు. డిజిటల్ ప్రపంచం అభివృద్ధి చెందుతున్న కొద్దీ ప్రజలు, ముఖ్యంగా పిల్లలు , యువకులు సురక్షితంగా ఉపయోగించాలన్నారు. ఇంటర్నెట్ విద్య సామాజిక పరస్పర చర్య, వ్యాపారానికి అనేక అవకాశాలను అందిస్తుందన్నారు. కార్యక్రమంలో నేషనల్ ఇన్సరేషన్ సైన్స్(ఎన్ఐసీ) జిల్లా డైరెక్టర్ వెంకటరమణ సురక్షిత ఇంటర్నెట్ గురించి సమాచారం అందించారు. ఈసందర్భంగా జిల్లాపంచాయతీ చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ వాగీష్ శివాచార్యప్లానింగ్ డైరెక్టర్ వినోద్, పరిమళ లతోపాటు వివిధ జిల్లా స్థాయి శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రాజ్యాంగం.. పవిత్ర గ్రంథం

- 'అంబేడ్కర్-చదువు' కార్యక్రమంలో రచయిత్రి వెంకమ్మ



మొక్కకు నీరుపోసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న వెంకమ్మ

బళ్లారి సిటీ, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ రూపొదించిన రాజ్యాంగం ప్రతి పౌరుడికి పవిత్ర గ్రంథమని రచయిత్రి వెంకమ్మ అన్నారు. భారతరత్న అంబేడ్కర్ జీవితం ,విజయాలను పరిచయం చేయడానికి నగరంలోని శ్రీమతి సుమంగళమ్మ మెమోరియల్ ఉమెన్స్ కళాశాల ఆడిటోరియంలో మంగళవారం కన్నడ సాంస్కృతికశాఖ నిర్వహించిన అంబేడ్కర్ చదువు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడారు. సమాజంలో అత్యంత అణగారిన వ్యక్తికి కూడా సామాజిక న్యాయం అందించే విధంగా రాజ్యాంగం రూపొందించారన్నారు. అర్థవంతమైన ప్రాథమిక హక్కులు, విధులను రాజ్యాంగం ఇచ్చిందన్నారు. అంబేడ్కర్ ఆనాటి యువతకు ఆదర్శప్రాయుడని ఆయన నడిచిన మార్గంలో అందరమూ నడవాలని పిలుపునిచ్చారు. కళాశాల పాలకమండలి చైర్‌పర్సన్ కాత్యాయని మరిదేవయ్య సమావేశానికి అధ్యక్షత వహించి మాట్లాడారు. ఈసందర్భంగా కన్నడ సాంస్కృతిక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ నాగరాజ్, ప్రిన్సిపాల్ గోవిందరాజులు, శివరాం, లెక్చరర్ నాగేశ్వరరావు,విక్టర్ ఇమ్యూనియేల్, బోదన,బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్‌లో బెస్ట్ కాలేజీ విద్యార్థుల ప్రతిభ



సయ్యద్ ఎం.అశ్ఫక్



పవన్ కుమార్



కిషన్ పాటిల్



లిఖిత

బళ్లారి సిటీ, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి జేఈఈ మెయిన్స్ పరీక్షల్లో బెస్ట్ కాలేజీ విద్యార్థులు ప్రతిభ చాటారు. సయ్యద్ ఎం.అశ్ఫక్ 98.22 పర్సంటైల్, పవన్‌కుమార్ 96.66, జై కిషన్ పాటిల్ 94.33, లిఖిత 93.69, అఫిఫా అంజుమ్ 92.57, సాయి హర్షితా 89.08 సాధించారు. వీరిని సంస్థ అధ్యక్షుడు కోనంకి రామప్ప, ఉపాధ్యక్షుడు కోనంకి తిలక్‌కుమార్, కార్యదర్శులు, మన్నెం శ్రీనివాసులు, కాలేజీ ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావ్, శ్రీనివాసరెడ్డి, సిబ్బంది వర్గం అభినందించారు.



ఆరిఫా



మహిర్



సాయి హర్షిత

ఒక్కటైన 36 జంటలు



దంపతులను ఆశీర్వదిస్తున్న మఠాధిపతులు

కంప్లి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : విజయనగరం జిల్లా హగరి బొమ్మనహళ్లి తాలుకాలోని నందిపురం గ్రామంలో మహేశ్వరస్వామి ఆధ్వర్యంలో 36 జంటలు ఒక్కటయ్యాయి. దొడ్డ బసవేశ్వర ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ వివాహాలు జరిగాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నియమరాజునాయక్ మాట్లాడుతూ ఈ సామూహిక వివాహాలు ఒక వరమన్నారు. ప్రతి ఒక్కరు ఇలాంటి సామూహిక వివాహాలను సద్వినియోగ పరచుకోవాలని కోరారు. ఎంత మంది ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న తరుణంలో ఇలాంటి వివాహాల వల్ల కుటుంబాలకు ఎంతో అనుకూలం ఇస్తుందని తెలిపారు. ఒక్కటైన జంట్లు ఎన్ని కష్టాలు వచ్చినా ఎదుర్కొని తమ జీవితంలో ధైర్యంగా ముందుకు నడవాలని స్వామివారు తెలిపారు. పలువురు నాయకులు, వివిధ మఠాల స్వాములు పాల్గొన్నారు.

నేడు ఉలిగమ్మ జాతర

బళ్లారిరూరల్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): కొప్పాళ జిల్లాలో ప్రఖ్యాతిగాంచిన మునిరాబాద్ ఉలిగమ్మ దేవస్థానం ఆవరణంలో బుధవారం ఉలిగమ్మదేవి మహోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ పదాధికారులు తెలిపారు. ఈ రథోత్సవానికి బళ్లారి కొప్పాళ్, రాయచూర్, హోస్పేట, జిల్లాలతో పాటు ఆంధ్ర, కర్ణాటక సరిహద్దు ప్రాంతాల్లో భక్తాదులు పెద్దఎత్తున పాల్గొని అమ్మవారిని దర్శించుకుని రథోత్సవంలో పాల్గొంటున్నట్లు తెలిపారు.

తాయమ్మదేవికి ప్రత్యేక పూజలు

సిరుగుప్ప, ఫిబ్రవరి 11(ఆంధ్ర జ్యోతి): తాయమ్మదేవికి మంగళవారం పురస్కరించుకుని భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. సిరుగుప్ప పట్టణం ఆదోని రోడ్డు మార్గంలో వెలసిన తాయమ్మదేవికి ప్రధాన అర్చకులు శ్రీనివాస అమ్మవారికి పుష్పాలంకరణ సేవలు చేశారు. ధూపదీప నైవేద్యములతో పూజలు చేశారు. భక్తులకు ప్రసాద పంపిణీ చేపట్టారు. దర్శనం కోసం భక్తులు బారులు తీరారు.



అలంకరణలో అమ్మవారు

హోసూరు జోన్

సుబ్రహ్మణ్య స్వామి ఆలయంలో విశేష పూజలు

హోసూరు ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): తమిళ నెల థాయ్‌లో వచ్చే పౌర్ణమి రోజున తైపూసంగా ఆచరిస్తారు. పురాణాల ప్రకారం రాక్షసుడిని సంహరించేందుకు సుబ్రమణ్యస్వామికి పార్వతీదేవి ఈటె (వేల్)ను ఇచ్చిన రోజుగా పరిగణిస్తారు. ఇలా సుబ్రమణ్యస్వామికి మంగళవారం విశేషపూజలు జరిగాయి. హోసూరు రైల్వే రోడ్డు పెరియార్ నగర్‌లో వెలసిన సుబ్రహ్మణ్యస్వామి ఆలయం, బృందావన నగర్‌లోని శ్రీవల్లీ దేవసేన సమేత మురుగన్ ఆలయంలో, అగరం సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలోనూ విశేషపూజలు జరిగాయి. కొన్ని ఆలయాలలో మురుగన్‌కు బంగారు కవచధారణతో అలంకరించారు. విశేషపూజల అనంతరం ప్రాకారోత్సవం నిర్వహించారు.



అలంకరణతో స్వామి వారు

బ్రహ్మదేవుడికి క్షీరాభిషేకం



పాల కళశాలతో వస్తున్న భక్తులు

హోసూరు, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): మాఘమాసం పౌర్ణమిని పురస్కరించుకుని బ్రహ్మకొండపై వెలసిన బ్రహ్మదేవుడికి మంగళవారం క్షీరాభిషేకం నిర్వహించారు. సరస్వతి వెల్ఫేర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 14వ వార్షిక తైపూసం సందర్భంగా మహిళలు పాలతో నిండిన కళశాలతో ఊరేగారు. కొండపైకి చేరి స్వామివారికి క్షీరాభిషేకం చేశారు. ప్రత్యేక పూజలు నిర్వహించి, విశేష అలంకరణతో స్వామి వారిని అలంకరించారు. దీపారాధన చేసి అనంతరం భక్తాదులందరికి తీర్థ ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో కృష్ణవేణి రాజీ, బీజేపి మాజీ జిల్లా అధ్యక్షుడు నాగరాజు, రఘుమాన్, హేమకుమార్, ప్రభాకరన్, శశికళ ప్రభాకరన్, కార్యదర్శి దేవరాజన్, శరవణన్, కోశాధికారి, శక్తివేల్, చిన్నప్ప, రాజేంద్రన్, మురుగన్, మునియప్పన్, డాక్టర్ శరవణన్, సహ పలువురు పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణకు మాత్రల పంపిణీ

హోసూరు, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): పిల్లల్లో పౌష్టికాహార లోపానికి నులిపురుగులు కూడా ఒక కారణమని వీటి నివారణకోసం ప్రత్యేక మాత్రలను ప్రభుత్వం సమకూర్చింది. హోసూరులో పాఠశాల విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేశారు. హోసూరు మేయర్ సత్య, డిప్యూటీ మేయర్ ఆనందయ్య, హెల్త్ కమిటీ చైర్మెన్ మాదేశ్వరన్, మున్సిపల్ ఎడ్యుకేషన్ కమిటీ చైర్మెన్ శ్రీధర్, మున్సిపల్ వెల్ఫేర్ అధికారి తదితరులు పాల్గొన్నారు. మున్సిపల్ సంక్షేమ అధికారి అజిత మాట్లాడుతూ హోసూరులో ఏడాది నుంచి 19 ఏళ్ల లోపు 76,117 మందికి మాత్రలు ఇచ్చేలా ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. ఇప్పటివరకు 74,852 మందికి పంపిణీ చేశామన్నారు. అలాగే 20-30 ఏళ్లలోపు వయస్సున్న వారికి 19,210 మంది మహిళలకుగాను 18,527 మందికి నులిపురుగుల నివారణ మాత్రలు ఇచ్చినట్లు తెలిపారు. పౌష్టికాహార కొరత వల్ల అలసట, అస్వస్థత, చదువులో శ్రద్ధ వహించలేరన్నారు. అంతేకాక రక్తహీనత, వాంతులు వంటివి నులిపురుగల వల్ల ఏర్పడే కారణాల వల్లే అన్నారు. మాత్రల ఎలాంటి దుష్పరిణామాలు ఉండవన్నారు.



విద్యార్థులకు మాత్రలు వేస్తున్న మేయర్ సత్య

ఘనంగా కుంభాభిషేకం

హోసూరు, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): హోసూరు సర్కిల్ పరిధిలోని గోవింద అగ్రహారం గ్రామంలో పెద్దమ్మదేవి ఆలయరాజగోపుం మహా కుంభాభీషేక కార్యక్రమం ఘనంగా జరిగింది. గంగాపూజ, యాగశాల పూజ, గణపతిపూజ, రక్షాబంధనం, నవగ్రహ పూజ, వేదాపారాయణంతో చండీయాగం నిర్వహించారు. రాజగోపురం కలశ సంప్రోక్షణ ప్రదాన కుంభాభిషేకం చేశారు. రుద్రహోమం, తదితర ధార్మిక కార్యక్రమాలు రెండు రోజులు జరిగాయి. అమ్మవారికి విశేషపూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఉత్సవాలలో చివరి రోజు మంగళవారం ఉదయం 10 గంటలకు పెద్దమ్మ దేవి కరగం ఊరేగింపు జరిగింది. నృత్యాలు చేసూ, పాటలు పాడుతూ అమ్మవారిని ఊరేగించారు. గోవింద అగ్రహారం గ్రామస్తులు, చుట్టుప్రక్కల గ్రామాల వారు పాల్గొన్నారు.



పెద్దమ్మదేవికి విశేషపూజలు

జోరుగా రోజా పూల ఎగుమతులు

హోసూరు, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): హోసూరు, తళి, కెలమంగలం, బేరికై, బాగలూరు, తదితర ప్రాంతాల్లో రోజా పూల సాగు అధికంగా ఉంది. ఇక్కడనుంచి పూలను ఎక్కువగా విదేశాలకు ఎగుమతి చేస్తుంటారు. సుమారు 2 వేల ఎకరాలల్లో రోజా పూల సాగు అవుతోంది. ముఖ్యంగా తాజ్‌మహల్, నోబాల్స్, గోల్డ్‌స్ట్రైక్, నవరన్, అవలంచర్, బెర్నియర్ తదితర పూలరకాలు సాగు చేస్తున్నారు. ప్రస్తుతం వాలెంటైన్స్ డేకు డిమాండ్ ఉంది. కాగా విమానచార్జీలు పెరగడంతో ఎగుమతులు చేసేందుకు రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ సంవత్సరం స్థానికంగా పండే రోజాలకు మంచి ఆదరణ లబించడంతో జైపూర్, ఢిల్లీ, ముంబై, కేరళ తదితర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తున్నారు.



ఎగుమతికి సిద్ధంగా ఉన్న పూలు